
Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను
ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly
సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..
కేంద్ర, రాష్ట ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యూలేషన్ ఇన్‌చార్జిలు కావలెను
వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు
అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 269 | హైదరాబాద్ | గురువారం 13 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## రీల్స్ యుగంలో షార్ట్‌కట్లు వద్దు!

ప్రధాని మోదీ వ్యాఖ్య

### మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ

జీవితంలో త్వరగా లక్ష్యాన్ని చేరుకోవాలనే తొందరలో ఎంచుకునే షార్ట్‌కట్ మార్గాలు ఒక్కోసారి తీవ్ర నష్టాలకు దారితీస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. ముందుకు సాగాలంటే అర్థ వంతమైన, సరైన మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. మాజీ రాష్ట్ర పతి రామ్‌నాథ్ కోవింద్ రాసిన ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిప బ్లిక్ లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం ఉదయం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించారు.

- 2లో



## గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించాలి

### సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలి

- మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను సహించం ..
- బకాయిలున్న మిల్లులపై కఠిన చర్యలు
- అవసరమైతే మహిళా సంఘాలకు మిల్లింగ్ బాధ్యతలు..
- ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలు

గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలని సూచించారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదని..తదుపరి కూడా ఎన్డీఎస్ఏ సలహాలే పాటించాలన్నారు.

హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)

బ్లాక్‌మెయిల్ చేసే మిల్లర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేదిలేదని స్పష్టం చేశారు. బకాయిలున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి పౌరసరఫరాల, నీటిపారుదల శాఖలపై వేర్వేరుగా సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలున్నట్లు తేలిందన్నారు. ఈ విషయంలోనూ ఎన్డీఎస్ఏతో సంప్రదించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి చెప్పగా.. ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్నచిన్న సమస్యలుంటే.. అధికారులు వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం తెలిపారు. "పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలి. నీటిపారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి..ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలి. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలి. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి

- మిగతా 2వ పేజీలో

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై స్టే

8 జీవోల అమలు నిలిపివేత

లబ్ధిదారులకు చెల్లింపులూ చేయరాదు: హైకోర్టు



హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకాల అమలు నిమిత్తం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోల అమలుపై స్టే విధించింది. ఈ జీవోల ఆధారంగా ఎంపికైన లబ్ధిదారులకు ఎలాంటి చెల్లింపులూ చేయరాదని తేల్చి చెప్పింది. ఈ జీవోలను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ వాదనలు వినిపిస్తూ ఈ పథకాల అమలు నిమిత్తం జారీచేసిన జీవోలకు రాజ్యాంగబద్ధత లేదన్నారు. "ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన అవివాహిత యువతులకు ఆర్థిక సాయం అందించే ఉద్దేశంతో 2014లో ప్రభుత్వం ఈ పథకాల్ని ప్రారంభించి వివిధ జీవోలను జారీ చేసింది. అనంతరం బీసీ, ఈబీసీ వర్గాలకూ విస్తరించింది. ఎటువంటి చట్టపరమైన నిబంధనల మద్దతు లేకుండానే ఆ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారు. ఆదాయ

- మిగతా 2వ పేజీలో



## అమిత్ షా x రాహుల్!

విద్యార్థులపై లాఠీచార్జికి చర్చకు సిద్ధమన్న కేంద్ర హోంమంత్రి

- అవసరమైతే 24 గంటలు సభలో చర్చిద్దామని విపక్షాలకు సవాల్
- లాఠీచార్జిపై సూటిగా సమాధానం కావాలన్న రాహుల్
- కాల్పులకు ఆదేశాలిచ్చింది ఎవరో చెప్పాలని డిమాండ్

నీట్ పేపర్ లీక్, ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలు, లాఠీచార్జి అంశాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను మరింత వేడెక్కించాయి. ప్రతిరోజు విపక్ష సభ్యులు ఈ అంశాలపై ఆందోళనలు చేస్తూ అమిత్‌షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబడుతున్నాయి.

- 2లో

## అనుముల బ్రదర్స్‌కు భూములు కారుచౌక



### 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా కొండల్‌రెడ్డి

- ఆ బిజినెస్ మోడల్ తెలంగాణ బిడ్డలకు చెప్పండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని మేము కష్టపడి 'టీ నిర్మిస్తే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని ఆయన విమర్శించారు.

హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)

'ఇది ఫ్యామిలీ -రన్.. ఫ్యామిలీ -డ్రైవ్ స్కామ్, ఇందులో జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంప్లాయీస్' అని ఎద్దేవా చేశారు. కానీ వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు మాత్రం కారుచౌకగా కేటాయింపు చేశారని తెలిపారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా భూములు దక్కించుకోవచ్చని స్పష్టం చేశారు. బుధవారం ట్విట్టర్ వేదికగా.. సీఎం సోదరులు భూ కుంభకోణాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ చెప్పారు. లక్ష రూపాయల పెట్టుబడితో

- మిగతా 2వ పేజీలో

## రూటు మార్చారు!

### పార్టీ మారలేదంటున్న ఎమ్మెల్యేలు

- అప్పట్లో సీ ఎం సమక్షంలో లో కండువా
- కేసీఆర్ ఏ మా నాయకుడు అంటూ కొత్త మాట
- అధికార పార్టీలో పొసగని ఎమ్మెల్యే లు

భారత్ రాష్ట్ర సమితి గుర్తుపై గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యేలు రూటు మారుస్తున్నారు. తూచ్ మేం పార్టీ మారలేదు అంటున్నారు. మా దారి కేసీఆర్ ఏ అంటు న్నారు. గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన దానం నాగేందర్ నుంచి నిజామాబాద్ సీనియర్ నేత, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వరకు ప్రతి ఒక్కరూ ఇదే మాట అంటున్నారు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

తమ నియోజకవర్గాల అభివృద్ధి పనులకు బడ్జెట్ నిధులు రాకపోవడం, కనీసం ముఖ్యమంత్రి, మంత్రుల అపాయింట్‌మెంట్‌లు కూడా సకాలంలో లభించకపోవడంతో వీరంతా తీవ్ర



అసంతృప్తికి లోనవుతున్నారు. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ సాంకేతికంగా, చట్టబద్ధంగా , అధికారికంగా తమ పార్టీలో విలీనం చేసుకోలేకపోవడమే. స్పీకర్ నోటీసులు, సుప్రీంకోర్టు, హైకోర్టులలో నడుస్తున్న పార్టీ మార్పిడి పిటిషన్ల భయంతో మేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం సీఎంను నిధుల కోసమే కలిశాం అని సాంకేతిక విచారణలలో

- మిగతా 2వ పేజీలో

## బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా సీఎం రేవంత్?

జీఆర్ఎంబీ అజెండాపై ఇంతకాలం ఎందుకు నోరు మెదపలేదు?

### మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)



జీఆర్ఎంబీ సమావేశ అజెండాపై బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సీఎం రేవంత్‌రెడ్డికి సోయి రాలేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని ఏపీ ప్రభుత్వం తమ అభ్యంతరాలను జీఆర్ఎంబీ అజెండాలో పెడితే ఇంతకాలం ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తే.. తెలంగాణ ప్రభుత్వం ఎందుకు

- మిగతా 2వ పేజీలో



## నేనే ఏసీబీకి పట్టిస్తా!

ఎన్నిసార్లు చెప్పినా మార్పు లేదు

- సబ్ రిజిస్ట్రార్లపై మంత్రి పొంగులేటి ఫైర్
- ఆస్తులపై హక్కుదారుల్లా వ్యవహరించొద్దు..
- కోర్టుల ఆదేశాలపై మీరు సొంతంగా నిర్ణయం తీసుకోవద్దు

హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)

'సబ్ రిజిస్ట్రార్లు మారాలి. లేదంటే నేనే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి పట్టిస్తా. ఇప్పటికే చాలాసార్లు చెప్పా. ప్రతి రోజూ ఏదో ఒక మూలన ఏసీబీ దాడులు జరు గుతూనే ఉన్నాయి. అయినా మీరు మారట్లేదు. ఎన్నిసార్లు చెప్పినా మీలో మార్పు కనిపించడం లేదు..'అంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు

- మిగతా 2వ పేజీలో

# అమిత్ షా × రాహుల్!

న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)

ఈ నేపథ్యంలో స్పందించిన షా.. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అవసరమైతే 24 గంటల పాటు సభను నిర్వహించి ప్రతి అంశంపైనా చర్చిద్దామని, విపక్ష సభ్యులు లేవనెత్తే ప్రతి ప్రశ్నకు తానే సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు. అయితే అమిత్‌షా ప్రతిపాదనపై రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. తమకు హోం మంత్రి లెక్చర్లు అవసరం లేద ని, విద్యార్థులపై కాల్పులు, లాఠీచార్జికి ఆదేశాలిచ్చింది ఎవరో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

### అమిత్‌షా సవాల్..

ఢిల్లీ ఘటనలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు సిద్ధమని స్పష్టం చేసిన అమిత్‌షా .. ప్రతిపక్షాలకు 24 గంటల చర్చ కు సవాల్ విసిరారు. ప్రతిపక్షాలు బుధవారం మధ్యా హ్నం 2 గంటలలోపు స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని సూచిం చారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు మధ్యా హ్నం 3 గంటల వరకు 24 గంటలపాటు చర్చ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చర్చలో స్వయంగా పాల్గొంటానని, విపక్ష సభ్యుల ప్రతి ప్రశ్నకు పాయింట్ల వారీగా సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు.

### దాచడానికి ఏమీ లేదు..

నీట్ పేపర్ లీక్, విద్యార్థుల ఆందోళనల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి దాచాల్సిందేమీ లేదని అమిత్‌షా అన్నారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభు త్వం చర్చకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. అయితే పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకో వడం ద్వారా ప్రజా సమస్య లపై చర్చకు అవకాశం లేకుం డా చేయడం సరికాదని విపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానిం చారు. తీవ్రమైన అంశాలను సభలో కేవలం ఒక ప్రకట నతో ముగించలేమని అమిత్‌షా స్పష్టం చేశారు. పార్లమెంటులో చర్చకు నిర్దిష్టమైన నియమ నిబంధనలు ఉన్నాయని, వాటి ప్రకారమే సమగ్ర చర్చ జరగాలని అన్నారు. అవసరమైతే స్పీకర్ అనుమతితో ప్రశ్నోత్తరాల సమయాన్ని వాయిదా వేసి చర్చ ప్రారంభించేందుకు సిద్ధం గా ఉన్నానని తెలిపారు. సభలో ప్రకటన చేసి వెళ్లిపోవడం పార్లమెంటరీ విధానం కాదని, సభ్యులు లేవనెత్తే అంశాలపై పూర్తిస్థాయిలో చర్చ జరగాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### ప్రతి రోజూ పార్లమెంట్‌కు వస్తున్నా..

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి క్రమం తప్పకుండా సభకు హాజరవుతున్నానని అమిత్‌షా చెప్పా రు. 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి వ్యాఖ్యలు పార్లమెంటరీ చర్చల్లో వినిపిస్తున్నాయని ప్రస్తావించారు. తాను తన ఛాం బర్‌లోనే ఉంటున్నానని, ఉభయ సభలను విపక్షాలు సాగనివ్వకుండా చేస్తే సభకు వచ్చి ఏం చేయగలనని ప్రశ్నించారు. హంగామా చేయడం మానేసి చర్చకు రావాలని, నిర్ణ యం వారి చేతుల్లోనే ఉందని, అర్థవంతమై న చర్చ కావాలా.. సభలో రచ్చ కొనసాగించాలా విపక్షాలే తేల్చుకోవాలని అన్నారు.

### మాకు లెక్చర్లు వద్దు : రాహుల్

హోంమంత్రి లోక్‌సభలో ఇచ్చే ఉపన్యాసాలు వినేందుకు విపక్షాలు, దేశ యువత సిద్ధంగా లేదని రాహుల్‌గాంధీ అన్నారు. తమకు లెక్చర్లు అవసరం లేదని, విద్యార్థులపై జరిగిన చర్యలకు సంబంధించిన ప్రశ్న లకు స్పష్టమైన సమాధానాలు మాత్రమే కావాలని తేల్చిచెప్పారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కాల్పులు జరపాలని ఎవరు ఆదేశించారో హోం మం త్రి చెప్పాలని డిమాండ్ చేశారు. 'మేకులున్న లాఠీలతో కొట్టేందుకు ఆదేశాలు ఎవరి చ్చా రో వెల్లడించాలన్నారు. ఆదేశాలు ఆయనే ఇచ్చి ఉంటే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఒకవేళ ఆయనకు తెలియకుండానే ఈ ఘోరం జరిగి ఉంటే ఆయన ఈ పదవికి పనికిరారు. హోంమంత్రికి సభకు వచ్చి మ మ్మల్ని ఎదుర్కొనే ధైర్యం లేదు. నిజం చెప్పే సాహసం లేకనే దాక్కుంటున్నారు. ఆయన మౌనమే ఆయన నేరాన్ని అంగీకరించినట్లు స్పష్టం చేస్తోంది. సభలో ఊహాజనిత కబుర్లు చెప్పడం మాకు అవసరం లేదు. కాల్పులకు బాధ్యులెవరో స్పష్టంగా తేల్చాలి. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా ఇద్దరికీ నిజాలను ఎదుర్కొనే గుండెధైర్యం లేదు' అని రాహుల్ విమర్శించారు. ఇదిలా ఉండగా సాధారణ చర్చతో సమస్యను పక్కదారి పట్టించవద్దని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి.

# గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుంది. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలి. గూడెందొడ్డి పంప్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. "మిల్లర్ల నుంచి బకాయిల వసూలుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించి, దానిపై క్యాబినెట్ సబ్‌కమిటీలో చర్చించాలి. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటాం. ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు పాల్పడే వారితో కఠినంగా వ్యవహరిస్తాం. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చింది. ఆ తప్పిదాన్ని మా ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉంది. అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయి వసూలు కావాల్సిందే. ఉద్దేశపూర్వకంగా బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకుని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలి. ఆ మిల్లులకు కేటాయించే ధాన్యాన్ని కూడా మహిళా సంఘాలకు కేటాయించి అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలనూ ఆ సంఘాలకే అప్పగిస్తాం. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పట్నుంచే తగు కార్యాచరణ రూపొందించాలి' అని సీఎం సూచించారు

'వడ్లు భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టాలి. ఐదు నియోజకవర్గాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50-100 ఎకరాల భూమిని కేటాయిస్తాం. వీటి



నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటుచేస్తాం. వీబీజీరామ్‌జీలో ప్లాట్‌ఫాంల నిర్మాణానికి అవకాశం ఉంది. విశాలమైన ప్లాట్‌ఫాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలి. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోగపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సమీక్షల్లో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సెక్రటరీ మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఆర్అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్‌నాయుడు, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై స్టే

(మొదటి పేజీ తరువాయి)

పరిమితితో సహా అర్హత ప్రమాణాలను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో చెప్పడంలేదు. ఈ పథకాల అమలుకు ప్రభుత్వ నిధులను భారీ మొత్తంలో వెచ్చించడం రాజ్యాంగ విరుద్ధం. విధివిధానాలను కార్యనిర్వాహక శాఖ రూపొందించడం చెల్లదు. అధికరణ 246 ప్రకారం చట్టాలను రూపొందించే అధికారం పార్లమెంట్, శాసనసభలకు మాత్రమే ఉంటుంది. ఆ అధికారాలను కార్యనిర్వాహక శాఖ తీసుకుని విధానాలను రూపొందించజాలదు. ఏ వర్గం అభివృద్ధికి తీసుకునే నిర్ణయమైనా శాసనపరమైన అధికార పరిధిలోనే ఉండాలి. ఈ జీవోలను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం జారీ చేశారు. సమాచార హక్కు ద్వారా తీసుకున్న వివరాల ప్రకారం 2014 నుంచి ఇప్పటివరకు సుమారు రూ.13 వేల కోట్లకుపైగా ఈ పథకాల కోసం వెచ్చించారు" అని వివరించారు. "గత విచారణ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ హాజరై చట్టపరమైన ఆమోదాలపై కౌంటరు దాఖలు చేస్తామని చెప్పారు. ఇప్పటివరకు కౌంటరు దాఖలు చేయలేదు. పైగా ప్రభుత్వ న్యాయవాది మరోసారి గడువు కోరుతున్నారు" అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. జీవోల అమలును నిలిపి వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను సెప్టెంబరు 9కి వాయిదా వేశారు.

# అనుముల బ్రదర్స్‌కు భూములు కారుచౌక

(మొదటి పేజీ తరువాయి)

వందల కోట్ల భూములు కొట్టేసే బిజినెస్ మోడల్‌ను తెలంగాణ బిడ్డలకు కూడా చెప్పండి అంటూ రేవంత్ రెడ్డికి శ్రీధర్‌బాబుకు చురకలు అంటించారు. రూ.1లక్ష పెయిడ్-అప్ క్యాపిటల్‌తో, ఒక్క ఉద్యోగి కూడా లేని 'టెస్సారాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రై.లి' అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ. 200 కోట్ల లాభం/ఆస్తి ఆర్జించిన 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీగా అనుముల కొండల్ రెడ్డి'ని ప్రకటించాల్సిందే అని ఎద్దేవా చేశారు. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన బిజినెస్ మోడల్ ఏంటో నేర్పించాలని హితవు పలికారు. వందల కోట్ల ప్రభుత్వ భూమి ని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి.. ఈ మ్యా జిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరి మితం కావాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ యువత మొ త్తానికి ఈ అనుముల హబ్ అవకాశాన్ని కల్పించాలని సూచించారు.

# అదానీ కోసం దేశం తాకట్టు

## ప్రధాని మోదీ రాజీ పడుతున్నారు
## అందుకు ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు
## ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)




అదానీకోసం ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, రాజీ పడ్డారని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. గౌతమ్ అదానీకి సంబంధించిన కేసును అమెరికా కోర్టు కొట్టివేయడంతో మోదీపై రాహుల్ ఆరోపణలు సంధించారు. దేశ ప్రయోజనాలను అమ్ముకోవాల్సి ఎందుకు వచ్చిందో చెప్పాలన్నారు. దీనివెనుక కంటికి కనిపించే దానికంటే ఎక్కువ ఉందని విమర్శించారు. అదానీకోసం దేశం భారీ మూల్యం చెల్లిస్తోందని మండిపడ్డారు. అమెరికా కోర్టు గౌతమ్ అదానీ, ఆయన సోదరుడు సాగర్ అదానీలపై కేసు కొట్టివేసిన అంశానికి సంబంధించి స్క్రీన్‌షాట్‌ను రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేసి మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 2024 నంబర్‌లో గౌతమ్, సాగర్ అదానీలతో సహా వినీత్ జైన్ తదితరులపై విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన ఒప్పందాలలో లంచాలు చెల్లించారనేది ప్రధాన ఆరోపణ. ఈ అంశంపై రాహుల్ గాంధీ గతం నుంచే తీవ్రంగా విరుచుకుపడుతున్నారు.

# రీల్స్ యుగంలో షార్ట్‌కట్లు వద్దు!

న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో 'జెన్ జీ'ని యువతకు పలు సూచనలు చేశారు. కొందరు ఫుట్‌బ్రిడ్జ్‌లను ఉపయోగించకుండా రైల్వే పట్టాలను దాటుతుంటారని, ఇలాంటి ప్రమాదకరమైన నిర్ణయాల వల్ల కలిగే నష్టాలను తెలియజేసేందుకే రైల్వేస్టేషన్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. 'ఏ షార్ట్ కట్ విల్ కట్ యూ షార్ట్' అని ఆ బోర్డులు హెచ్చరికలు చేయడమే కాకుండా, జీవితానికి పాఠాలు నేర్పుతాయన్నారు. ప్రస్తుతం యువతపై ఇన్‌ఫ్లు యెన్స ర్లు, రీల్స్ తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వీటి ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించారు.

నేటి డిజిటల్ యుగంలో 'జెన్ జీ'లో ఏకాగ్రత, లోతైన ఆలోచన శక్తి తగ్గిపోతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సమయం వృథా చేయకుండా, జీవితంలో నిజమైన పాఠాలు నేర్చుకోవడానికి మహనీయులు, నాయకుల ఆత్మకథలను చదవాలన్నారు. ఆత్మకథలు చదవటం వల్ల వారు ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాల నుంచి ఎంతో నేర్చుకోవచ్చున్నారు. పుస్తకపఠం వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే కాకుండా, సమా జం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొందిస్తుందన్నారు. యువత డిజిటల్ యుగానికి




పరిమితం కాకుండా నిరంతరం పుస్తకాలు చదవడం కొనసాగించాలని, దేశానికి సేవ చేసిన వారి అనుభవాలను చదివి స్ఫూర్తి పొందాలని స్పష్టం చేశారు. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరువాలంటే ఎప్పటికైనా కష్టపడే తత్వమే విజయాన్ని ఇస్తుందన్నారు.

### కోవింద్‌పై మోదీ ప్రశంసలు..

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌పై ప్రధాని ప్రశంసలు కురిపించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన రామ్‌నాథ్ కోవింద్ జీవితం పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఎన్నో కష్టాలను ఓపికగా ఎదుర్కొని దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధి రోహించారని పేర్కొన్నారు. రాష్ట్రపతి పదవి నుంచి విరమణ చేసిన తర్వాత కూడా కోవింద్ విశ్రాంతి తీసుకోకుండా దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా 'వన్ నేషన్-- వన్ ఎలక్షన్' (జమిలి ఎన్నికలు) వంటి అంశా లపై ఆయన కొనసాగిస్తున్న కృషి దేశసేవ పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. కోవింద్ చిన్ననాటి విషాదాన్ని గుర్తుచేసుకున్న ప్రధాని మోదీ భావోద్వేగానికి గురయ్యారు. బాల్యంలో వారి ఇల్లు అగ్నిప్రమాదానికి గురైనప్పుడు వస్తువులను కాపాడేందుకు ప్రయత్నించిన కోవింద్ తల్లి ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రస్తావించారు. కోవింద్ ఆత్మకథ శీర్షిక ఎంతో అద్భుతంగా ఉందని, ఆయన జీవితంలో ఎదుర్కొన్న పోరాటాలు వ్యక్తిగతమైనవి అయినప్పటికీ.. వాటి ద్వారా సాధించిన విజయం మాత్రం భారత ప్రజాస్వామ్యానిదే నని అభివర్ణించారు.



# రూటు మార్చారు!

(మొదటి పేజీ తరువాయి)

వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన పరిస్థితి వీరికి ఏర్పడింది. మరోవైపు, కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల బీఆర్ఎస్ లో ఉన్న పరపతి కూడా కోల్పోయారు. ఫలితంగా ఇటు అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే గుర్తింపు రాక, అటు బిఆర్ఎస్‌పై హక్కు లేక రాజకీయంగా రెంటికి చెడ్డ రేవడి గా మారారు.

### పొసగని పాత.. కొత్త నేతలు

రాజకీయంగా విలీనం చేసుకునే ప్రక్రియలోనూ కాంగ్రెస్‌ది తీవ్రమైన వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది. బీ ఆర్ ఎస్ నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యత ఇస్తుంటే, నియోజకవర్గాల్లో పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు, ద్వితీయ శ్రేణి నేతలు అసంతృప్తికి గురవుతున్నారు. ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ స్థానిక కాంగ్రెస్ నాయకత్వంతో రోజూ ప్రోటోకాల్ యుద్ధాలు చేయాల్సి రావడం, బాన్సువాడలో పోచారం శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ పాత శ్రేణుల నుంచి సహకారం లభించకపోవడం ఇందుకు నిదర్శనాలు. సొంత పార్టీ మూల శ్రేణులను ఒప్పించకుండా, వలస నేతలకు రక్షణ కల్పించే స్పష్టమైన రోడ్‌మ్యాప్ లేకుండా కేవలం సంఖ్యాబలం కోసం రాత్రికి రాత్రే కండువాలు కప్పడం కాంగ్రెస్ అధిష్టానపు రాజకీయ తొందరపాటు ను ప్రతిబింబిస్తోంది.

### మిగిలిన వాళ్ళు 3ఎం అంటారో

బీ ఆర్ ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెలే లు ఇలా మాట మార్చడం కాంగ్రెస్ సర్కార్‌కు రాజకీయంగా ఎదురుదెబ్బగా మారుతోంది. మేము కేసీఆర్ ని మోసం చేయాలనుకోలేదు, నిధుల కోసమే వచ్చాం కానీ ఇక్కడేమీ జరగడం లేదు అని పోచారం వంటి సీనియర్లు బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండడం, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి బిఆర్ఎస్‌లో కలిసిపోవడం వంటి పరిణామాలు కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టాయి. శాసనసభా బలం ఉండి కూడా బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యేలను ఆకర్షించే క్రమంలో అనుసరించిన ప్రణాళికారాహిత్యమే ఈ పరిస్థితికి మూలం. కేవలం నంబర్ గేమ్ కోసం చేర్చుకుని, వారిని రాజకీయంగా, సాంకేతికంగా కాపాడుకోలేకపోవడం, అలాగే నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడం కాంగ్రెస్ అధినాయకత్వపు వ్యూహాత్మక తప్పు. ఇదే పరిస్థితి కొనసాగితే.. మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా భవిష్యత్ మనుగడ కోసం పాత గూటికి చేరుకోవడమో, లేదా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగంగా గళమెత్తడమో ఖాయంగా కనిపిస్తోంది.

# బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా సీఎం రేవంత్?

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అభ్యంతరం చెప్పలేదు?, ఎందుకు జీఆర్ఎంబీని నిలదీయలేదు?, ఎందుకు ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని నిలదీశారు. ఈ మేరకు బుధవారం ట్విట్టర్ వేదికగా హరీశ్‌రావు స్పందించారు. లేఖలతో పనులు కావు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం చేయాలని హరీశ్ హితవు పలికారు. ఏపీ ప్రభుత్వం జీఆర్ఎంబీ అజెండాలో పెట్టిన అంశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, అవి ఎజెండా నుంచి తొలగించే వరకు తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టాలని, అవసరమైతే.. ఆ అంశాలు వెనక్కి తీసుకోకపోతే జీఆర్ఎంబీ సమావేశానికి హాజరు కాబోమని కరాఖండిగా తేల్చి చెప్పాలని ఆయన స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి.. ఇది రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు.. తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన విషయం.. తెలంగాణ నీటి హక్కులకు సంబంధించిన విషయమని తెలిపారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో జరిగే జీఆర్ఎంబీ అజెండాను ఉపసంహరించుకోకుండా నిర్వహిస్తే.. తెలంగాణ ప్రాజెక్టులను కాపాడుకోవడం కోసం బీఆర్ఎస్ పార్టీ వేలాది మందితో జీఆర్ఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తుందని హెచ్చరించారు. కేంద్రం చేతిలో ఉన్న జీఆర్ఎంబీ, చంద్రబాబు, రేవంత్ కలిసి తెలంగాణకు చేస్తున్న జల ద్రోహాన్ని అడ్డుకుంటామన్నారు.

### ఎంజీఎంలో బెడ్ లేదు.. కాంగ్రెస్ పాలనలో పేదలకు భరోసా లేదు

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో తీవ్ర అస్వస్థతతో వచ్చిన ఓ రోగికి బెడ్ అందుబాటులో లేక నేలపైనే పడుకోవాల్సి వచ్చిన దృశ్యంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ వేదికగా తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రభుత్వ వైద్య వ్యవస్థ దుస్థితికి ఈ దృశ్యం సజీవ సాక్ష్యమని విమర్శించారు. దవాఖానలో బెడ్ లేదు.. కాంగ్రెస్ పాలనలో పేదలకు భరోసా లేదని మండిపడ్డారు. నాడు దేశానికే ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ వైద్యం.. నేడు పేద రోగులకు కనీసం బెడ్ కూడా అందించలేని దుస్థితికి చేరిందని విమర్శించారు. తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రికి వచ్చిన రోగి నేలపైనే పడుకుని వైద్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. ఎంజీఎం పరిస్థితులను తక్షణమే చక్కదిద్ది పేదలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

# నేనే ఏసీబీకి పట్టిస్తా!

(మొదటి పేజీ తరువాయి)

తెలిసింది. 22ఏ (నిషేధిత) జాబితాలో ఉన్న భూములు, ఆస్తులపై సచివాలయంలో సమీక్ష సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ల వ్యవహారశైలిని ప్రస్తావించిన ఆయన.. కీలక వ్యాఖ్యలు చేసినట్టు రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు నాలుగు జిల్లాల రిజిస్ట్రార్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'సబ్ రిజిస్ట్రార్లు స్టాంపులు వేసే అధికారులు మాత్రమే. ప్రజల భూములు, ఆస్తులను ధ్రువీకరించేందుకు మాత్రమే ఆ అధికారాలుంటాయి తప్ప ఆ ఆస్తులు సబ్ రిజిస్ట్రార్లవి అయినట్టు వ్యవహరించకూడదు. పేదలు రిజిస్ట్రేషన్ల కోసం వస్తే కనీసం వారి ముఖం చూడకుండా మాట్లాడతారు. ఒకవేళ ప్రజల దరఖాస్తులను తిరస్కరించాల్సి వస్తే కనీసం తగిన సమాధానం కూడా చెప్పరు. కావాల్సిన వాళ్లను మాత్రం కూర్చోబెట్టి మరీ ఏం చేయాలో సలహాలు ఇచ్చి పంపుతారు..'అని అన్నట్టు సమాచారం. 'కోర్టులకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకుంటే రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పడం, కోర్టు ఉత్తర్వులను సాకుగా చూపెట్టి అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేయడం మానుకోవాలి. కోర్టు ఉత్తర్వులు గౌరవించాల్సిందే కానీ, నిజంగా ఆ ఉత్తర్వులు వచ్చిన భూమి లేదా ఆస్తి ప్రభుత్వానికి చెందినదే అయితే అది ప్రభుత్వానికే దఖలు పడేలా ఏం చేయాలన్నదాని గురించి ఆలోచించాలి. అంతేతప్ప వెంటనే సబ్ రిజిస్ట్రార్లు నిర్ణయం తీసుకోవద్దు. జిల్లా రిజిస్ట్రార్ల ద్వారా ఐజీతో మాట్లాడాలి. ప్రభుత్వానికి చెందిన భూమే అయితే దాన్ని ఖచ్చితంగా కాపాడాల్సిందే. అసలు కోర్టు ఉత్తర్వులపై సబ్ రిజిస్ట్రార్లు నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదు.'అని ఆయన ఆదేశించినట్టు తెలిసింది. ఇకనైనా సబ్ రిజిస్ట్రార్లు మారాలని, లేదంటే ఏం చేయాలో అది చేస్తానని తీవ్రంగా హెచ్చరించినట్టు సమాచారం. మరోవైపు కొత్తగా వస్తున్న నిషేధిత జాబితా సమస్యల విషయంలో కలెక్టర్ల కర్తవ్యంపై పొంగులేటి హితబోధ చేశారని తెలుస్తోంది. సమస్య వచ్చినప్పుడు పరిష్కరించడం కాదని, అసలు సమస్య రాకుండా చూసుకోవాలంటూ నిషేధిత జాబితా భూముల వివరాల నమోదులో కలెక్టర్ల నిర్లక్ష్యాన్ని కూడా మంత్రి ఎత్తిచూపినట్టు సమాచారం. కాగా రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులను ఉద్దేశించి అదే శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.

# బహుముఖ ప్రజ్ఞాశాలి కళ్యాణం శ్రీనివాస్

- సాహిత్యం, యానిమేషన్, చిత్రకళ, కృత్రిమ మేధ రంగాలలో బహుముఖ సేవలు
- అమెరికన్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్
- కరీంనగర్ కు వన్నెతెస్తున్నశ్రీనివాస్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఆగస్టు12**





సాహిత్యం, చిత్రకళ, జర్నలిజం, కార్టూనింగ్, అనిమేషన్, కృత్రిమ మేధస్సు ( ఏఐ ) ఆధారిత సంగీతం, షార్ట్ ఫిల్మ్, వెబ్ సిరీస్‌లు, ఫీచర్ ఫిల్మ్ నిర్మాణం ఇలా ఒకే వ్యక్తిలో అనేక ప్రతిభలు మిళితమైన అరుదైన సృజనకారుడు కల్యాణం శ్రీనివాస్. తెలుగు సాహిత్యం, కళలు, అనిమేషన్ ఏఐ ఆధారిత సృజనాత్మక రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ గ్లోబల్ అచివర్స్ కౌన్సిల్, సౌత్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్సిటీ సంయుక్తంగా ఆయనకు తెలుగు సాహిత్యంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశాయి. సాహిత్యంతో ప్రారంభమైన శ్రీనివాస్ ప్రయాణం క్రమంగా విభిన్న రంగాలకు విస్తరించింది. చిన్ననాటి నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకున్న కల్యాణం శ్రీనివాస్ పదో తరగతి నుంచే కవిత్వ రచన ప్రారంభించారు. అనంతరం బిఏ లిటరేచర్ పూర్తి చేసి,ఎంఏ తెలుగు సాహిత్యంలో స్నాతకోత్తర విద్యను అభ్యసించారు. విద్యార్థి దశలోనే "హృదయమన గేయ సంపుటి", "పిడికిలి కవితా సంపుటి" అనే రెండు పుస్తకాలను ప్రచురించి రచయితగా గుర్తింపు పొందారు. ఆయన రచించిన అనేక గేయాలు వివిధ వేదికల ద్వారా ప్రజల్లోకి చేరాయి. 200కు పైగా పుస్తకాలకు ముఖ చిత్రాలు వేయడం ద్వారా ప్రతిభావంతమైన చిత్రకారుడిగా ఆయన విశేష గుర్తింపు పొందారు.తద్వార అనేక మంది రచయితల రచనలకు కళాత్మక రూపాన్ని అందించారు. జర్నలిజంపై ఆసక్తితో ఈనాడు, ఆంధ్రప్రభ దినపత్రికలలో జర్నలిస్టుగా పనిచేశారు. అదే సమయంలో రాజకీయ కార్టూనిస్టుగా కూడా సేవలందిస్తూ సమకాలీన అంశాలపై తనదైన శైలిలో కార్టూన్లు రూపొందించి ప్రశంసలు అందుకున్నారు.



సంప్రదాయ 2డి అనిమేషన్‌లో రెండు దశాబ్దాల అనుభవం సాధించారు. 1996లో లక్ష్మీపతి స్కాలర్‌షిప్ లభించడంతో హైదరాబాద్‌లో అనిమేషన్ కోర్సు పూర్తి చేసిన ఆయన, అనంతరం దాదాపు 20 సంవత్సరాలకు పైగా ట్రేడిషనల్ 2డి అనిమేషన్ డైరెక్టర్ గా అనిమేషన్ పరిశ్రమలో పనిచేశారు. సినిమా భాష, విజువల్ స్టోరీటెల్లింగ్, షాట్ కంపోజిషన్, స్క్రీన్‌ప్లే, కెమెరా వ్యాకరణం, ఎడిటింగ్ తదితర అంశాలపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. అనిమేషన్ రంగంలో పనిచేస్తున్న సమయంలో "లేడీ లక్ " అనే ప్రముఖ అనిమేషన్ సిరీస్‌లో సాధారణంగా 20 మంది సీనియర్ అనిమేటర్లు కలిసి రూపొందించాల్సిన ఒక పూర్తి ఎపిసోడ్‌ను, కల్యాణం శ్రీనివాస్ ఒక్కరే కేవలం 22 రోజుల్లో పూర్తి చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఈ అసాధారణ ప్రతిభను గుర్తించిన కెనడాకు చెందిన అంబర్ వుడ్ సంస్థ ఆయనకు ప్రత్యేక ప్రశంసా పత్రం ప్రదానం చేసింది. ఈ ఘనత ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. అనిమేషన్, చిత్రకళ, కార్టూనింగ్ రంగాల్లో ఆయనకు అనేక అవార్డులు, ప్రశంసలు, సన్మానాలు లభించాయి. సంప్రదాయ సినీ నిర్మాణంపై ఉన్న అనుభవాన్ని ఆధునిక సాంకేతికతతో మేళవిస్తూ, గత ఏడాది నుంచి ఏఐ ఆధారిత ఫిల్మ్ మేకింగ్ పై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న వివిధ ఏఐ టూల్స్‌ను అధ్యయనం చేస్తూ, వాటి సామర్థ్యాలు, పరిమితులు, పూర్తి స్థాయి సినిమా నిర్మాణంలో వాటి వినియోగంపై నిరంతరం ప్రయోగాలు చేస్తున్నారు. ఏఐ ద్వారా సినిమా నిర్మాణానికి సంబంధించిన తన అనుభవాన్ని యూట్యూబ్, శిక్షణ కార్యక్రమాలు,ఇతర వేదికల ద్వారా వేలాది మందితో పంచుకుంటున్నారు. ఏఐ సాంకేతికతను వినూత్నంగా వినియోగిస్తూ "పారిజాత" అనే ఇన్‌ఫ్లూయెన్సర్‌ను సృష్టించి, ఆమెను కథానాయికగా ఉపయోగిస్తూ సంగీత వీడియోలలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 50కు పైగా తెలుగు పాటలకు స్వయంగా సాహిత్యం రచించి, ఏఐ ద్వారా సంగీతాన్ని రూపొందించి, అదే ఏఐ సాంకేతికతతో ఫోటోరియలిస్టిక్ విజువల్స్‌ను సృష్టించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన రూపొందించిన పాటల్లో "శ్రీ రాముడు మాదేవుడు", "ఏములాడ గుళ్లల్లా", "ఎండయ్యో శివయ్య", "అమ్మ పాట", "పార్వతే సతి జంగమా", "దూదు బసవన్నలు", "బతుకమ్మ పాట", "సంక్రాంతి పాట", "కొడుకుల్లారా", "ఎవరికీ అర్థం కాదు", "ఇంత సొగసు ఎక్కడిది", "యాదికొస్తావే", "మందు బాబులు", "సాఫ్ట్‌వేర్ సత్తి" వంటి అనేక గీతాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఏఐ సంగీతాన్ని కేవలం తన సృజనలకు మాత్రమే పరిమితం చేయకుండా, అమెరికా, సింగపూర్, దుబాయ్, జాంబియా దేశాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది సాహితీవేత్తల పాటలకు పూర్తిగా ఉచితంగా ఏఐ సంగీతాన్ని అందిస్తూ వారి రచనలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ప్రచురణలు, సంగీత రూపం కోసం ఎదురుచూస్తున్న అనేక మంది సాహితీవేత్తల రచనలు ప్రజల్లోకి చేరడమే కాకుండా, స్థబ్దంగా ఉన్న వారి సాహిత్య సృజనకు కొత్త ఊపునిచ్చారు. ఏఐ సంగీతం ద్వారా కొత్త తరం రచయితలు, కవులు, గేయరచయితలను ప్రోత్సహిస్తూ సాహిత్య సేవలో విశేష పాత్ర పోషిస్తున్నారు. సాంకేతికతను ప్రతి తెలుగు వ్యక్తికి చేరవేయాలనే లక్ష్యంతో "ఏఐ వీడియో మేకింగ్ తెలుగు " పేరుతో యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. ఈ ఛానల్ ద్వారా ఏఐ ద్వారా సంగీతం, వీడియోలు,షార్ట్ ఫిల్మ్, సినిమా నిర్మాణం, ఆధునిక ఏఐ టూల్స్ వినియోగంపై వేలాది మందికి సులభమైన తెలుగులో అవగాహన కల్పిస్తున్నారు. ఏఐ రంగంలో శిక్షణను మరింత విస్తరించేందుకు "కళ్యాణం శ్రీనివాస్ ఏఐ ఫిల్మ్ మేకింగ్ అకాడమీని " స్థాపించారు. ఏఐ మ్యూజిక్ , ఏఐ ఫిల్మ్ మేకింగ్ , ఏఐ స్టోరీటెల్లింగ్ , ప్రాంప్ట్ ఇంజనీరింగ్ , ఏఐ విజువల్ డిజైన్ , ఏఐ షార్ట్ ఫిలిమ్స్ , ఏఐ ఫీచర్ ఫిల్మ్ ప్రొడక్షన్ వంటి విభాగాల్లో సమగ్ర శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవిష్యత్తులో తెలుగు యువతను ప్రపంచ స్థాయి ఏఐ సినీ సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఈ అకాడమీని అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవల "వందే మాతరం" పేరుతో నిర్వహించిన ఏఐ షార్ట్ ఫిల్మ్ పోటీలో ఐదు నిమిషాల నిడివి గల ఏఐ షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించి విశేష ప్రశంసలు అందుకున్నారు. ఈ కృతికి గాను కేంద్ర ప్రభుత్వం నుంచి అభినందన పత్రాన్ని అందుకున్నారు. అలాగే "పోక్సో" చట్టంపై అవగాహన కల్పించే ఐదు నిమిషాల ఏఐ షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించారు. సామాజిక సమస్యలను ప్రతిబింబించే "శ్మశానం" అనే మరో ఏఐ షార్ట్ ఫిల్మ్‌ను కూడా నిర్మించారు. ప్రస్తుతం "మాయపుటలు" పేరుతో ఏఐ వెబ్ సిరీస్ నిర్మాణంలో నిమగ్నమై ఉన్న కల్యాణం శ్రీనివాస్, పూర్తిస్థాయి ఏఐ ఫీచర్ ఫిల్మ్ నిర్మాణానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు. కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, విజువల్ డిజైన్, పాత్రలు, విజువల్ ఎఫెక్ట్స్, పోస్ట్ ప్రొడక్షన్ వరకు ఏఐ సాంకేతికతను సమగ్రంగా వినియోగిస్తూ తెలుగు సినీ పరిశ్రమలో కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఏఐ సహాయంతో అనేక రంగంలో కళ్యాణం శ్రీనివాస్ అందిస్తున్న సేవలకు గ్లోబల్ అచివర్స్ కౌన్సిల్,సౌత్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం పట్ల సాహిత్య, కళా, సినీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. సంప్రదాయ కళలను ఆధునిక కృత్రిమ మేధస్సుతో మేళవిస్తూ, తెలుగు సాహిత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా వినిపించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్న కల్యాణం శ్రీనివాస్ ప్రయాణం, నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.



## వరంగల్ మూడో డివిజన్ కొత్తపేటలో అవసగాహన సదస్సు

**హన్మకొండ, ఆగస్టు 12, అనీల్ ప్రజాతీర్పు ప్రతినిధి**

కంటిన్జెన్సీ ప్రత్యామ్నాయ పంటలపై బుధవారం కొత్తపేట గ్రామంలో ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు పై వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు ముఖ్యంగా ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో వరికి బదులుగా ఆరుతడి పంటలు అయినటువంటి పెసర, మినుము, ప్రొద్దుతిరుగుడు, కూరగాయల సాగు తదితర పంటలను గురించి వివరించారు ఉద్యాన శాఖ అధికారి కూరగాయల సాగు గురించి వివరిస్తూఉద్యాన శాఖ ద్వారా ఇస్తున్నటువంటి సబ్సిడీ వివరాలను రైతులకు తెలియజేసారు,ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నెలకుర్తి రవీందర్ రెడ్డి, విస్తరణ అధికారి బరుపాటి ప్రవళిక, ఉద్యాన శాఖ విస్తరణ అధికారి వేణు కుమార్, అధిక సంఖ్యలో కొత్తపేట గ్రామ రైతులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రమును ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రమును సందర్శించిన డిఎంహెచ్వో

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 12**

మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ దండేపల్లి మండలంలోని లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రమును ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రమును ఆకస్మికంగా సందర్శించడం జరిగినది. బుధవారం లింగాపూర్ ఉపకేంద్రమును జాతీయ ప్రామాణికత క్వాలిటీ నిర్ధారణ కొరకు అన్ని రకాల ప్రామాణికతలను ఇండికేటర్లను సమకూర్చుకోగలరని ఆదేశాలు ఇవ్వడం జరిగినది ముఖ్యంగా రోగులకు అందిస్తున్న సేవలు సదుపాయాలు మందులు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు వాటి నమోదు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అవగాహన పోస్టర్లను అవగాహన కార్యక్రమంలో చేపట్టడానికి ఉపకేంద్రంలో అన్ని రకాల సదుపాయాలను జాతీయ ప్రామాణికత కోసం తయారు చేసుకోగలరని ఆదేశాలు ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో జాతీయ ప్రామాణికత జిల్లా సంచాలకులు అజ్మీర్ రాజకుమార్,మిడిల్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్ సైలేష్, ఆరోగ్య కార్యకర్తలు అరుణ, వైద్య సిబ్బంది జిల్లా క్వాలిటీ సిబ్బంది మౌనిక, శ్వేత,రాజు,తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నర్సింగ్ అధికారులు వైద్య సిబ్బంది ఫార్మసీ ఆఫీసర్ లాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పర్యవేక్షించడం జరిగినది జిల్లాలో అన్ని ఉపకేంద్రముల లో వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని ప్రతి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ముందుగా పిల్లల వివరములను అందుబాటులో ఉంచుకోవాలని ఆశా కార్యకర్తలు ముందుగా తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆదేశించినారు అదేవిధంగా యువిన్ పోర్టల్ లో నమోదు చేయాలి. అందుబాటులో ఉన్న వ్యాక్సినేషన్ వివరములను ప్రజలకు తెలియజేయాలి సమన్వయంతో జవాబులు చెప్పి అందుబాటులో ఉన్న వ్యాక్సినేషన్ కేంద్రాలకు పంపించాలి అదేవిధంగా 14 సంవత్సరం నిండిన ఆడపిల్లలకు హెచ్పీవీ వ్యాక్సినేషన్ ఇప్పించాలి దీని కోసం చర్యలు చేపట్టాలని ఆదేశించినారు.



## బిజెపి ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 12**

భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో పట్టణ అధ్యక్షులు ధార కళ్యాణి ఆధ్వర్యంలో 500 మీటర్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరు వెంకటేశ్వర గౌడ్, మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరంగా ర్యాలీ బెల్లంపల్లి పట్టణ ఇన్చార్జ్ అమురాజుల శ్రీదేవి, పాల్గొన్నారు ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణ ప్రజలకు 80వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు అంతేకాకుండా నేటి బాలలే రేపటి పౌరులని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి దేశ నిర్మాణానికి సమర్థులై ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బెల్లంపల్లి పట్టణ వ్యాపారులు పట్టణ ప్రముఖులు కుల సంఘాల ప్రతినిధులు వివిధ కాలేజీల విద్యార్థులు జాతీయ జెండా పట్టుకొని పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సీనియర్ నాయకులు సామాజిక కార్యకర్త లు కొండబాబు, లక్ష్మీనారాయణ,కాసర్ల తిరుపతి,కొయ్యల ఏమాజీ, పులగం తిరుపతి,బుల్ రెడ్ల కేశవరెడ్డి,జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్, సీనియర్ నాయకులు మధ్యర్ల శ్రీనివాస్,దూది ప్రకాష్,శనిగారపు శ్రావణ్, నర్సింగ్ గోమాస కమల, నల్లుల సంగీత,కళ్లపల్లి నవీన్,జీదుల రాములు, భాష బోయిన యుగేందర్, గంధం అనిల్,శ్రీనివాస్,ఓం సాయి,సుఖ,మల్లేష్,ఇప్ప స్వామి,షేక్ గౌస్ బాబా, బాగ్మోహన్,గాండ్ల మహేష్, సుధాకర్,కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.





## చెట్లు సర్వ జీవుల మనుగడకు జీవనాధారం

- ఎండపల్లి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్ యాదవ్
- రాజారాంపల్లి గ్రామపంచాయతీలో పండ్ల మొక్కల పంపిణీ

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఆగస్టు 12**

సర్వ జీవి మనుగడకు చెట్లే జీవనాధారమని, జీవులకు ప్రాణ వాయువు అందించే చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎండపల్లి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు, రాజారాంపల్లి గ్రామ సర్పంచ్ సంగ రమేష్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం రాజారాంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామస్తులందరికీ పండ్ల చెట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ యాదవ్ మాట్లాడుతూ చెట్లు ప్రాణవాయువును అందించడమే కాకుండా, వర్షాలు కురవడానికి, భూగర్భ జలాల పెంపుదలకు దోహదపడతాయని అలాగే సర్వజీవులకు ఆవాసంగా ఉపయోగపడతాయని అన్నారు. పండ్లు, కూరగాయలు, పూలు, కలప మొదలగు చెట్లతో ఆర్థిక వనరులు కూడా చేకూరుతాయని తెలియజేస్తూ గ్రామస్తులకు పండ్ల మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేరుగు జంపయ్య(జానీ), పంచాయతీ కార్యదర్శి దాసరి మల్లేశం, కారోబార్ బొంగాని హరీష్, వార్డు సభ్యులు, ఆశా వర్కర్ లు బంద్ర జమున, దేవి విమల, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 12.**



ప్రజలకు పోలీస్ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ సిబ్బందితో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. బ్లూ కోల్ట్, పెట్రో కార్స్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్, అత్యవసర స్పందన, నేర నియంత్రణ, నేరస్తులపై నిఘా, కమ్యూనిటీ పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. హాట్‌స్పాట్‌ల వద్ద పెట్రోల్ వాహనాలను కొద్దిసేపు నిలిపి, అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలు, కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు.ముఖ్యంగా బ్యాంకులు, ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డయల్-112 కాల్స్‌కు తక్షణశీ స్పందించాలి:లి కంట్రోల్ రూమ్, పోలీస్ స్టేషన్, డయల్ శ్రీ-112 లేదా ప్రజల నుంచి అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం, బాధితులు మరియు సాక్షుల నుంచి సమాచారం సేకరించడం, సంఘటనా స్థలాన్ని భద్రపరచడం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. బ్యాంకులు, ఏ టి ఎం ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితులు, ఆస్తి సంబంధిత నేరస్తులు, దొంగసొత్తు కొనుగోలు చేసే వ్యక్తులు, తరచూ నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు.కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, రెసిడెంట్ అసోసియేషన్లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో తరచూ కమ్యూనిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తులను సకాలంలో గుర్తించి, వేగంగా స్పందించి వారి ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్ట్ మరియు పెట్రోల్ కార్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి విలువైన ప్రాణాలను కాపాడటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ యొక్క సమావేశంలో డి సి ఆర్ బి డిఎస్పి రవి కుమార్, బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు.

# పి ఆర్ సి ని ప్రకటించి అమలు చేయాలి

- పెండింగ్ డి.ఏ లను మంజూరు చేయాలి
- దశల వారి పోరాటంలో భాగంగా తాసిల్దార్ కు వినతి

**(పగడాల రామారావు ప్రజా తీర్పు కాల మండల ప్రతినిధి) ఆగస్టు 12**



గార్ల పే రివిజన్ కమిషన్ నివేదికను తెప్పించుకొని, 1జూలై 2003 నుంచి వెంటనే అమలు చేయాలని యూ,ఎస్, పి,సి స్టీరింగ్ కమిటీ నాయకులు పి యాదగిరి నాయక్, ఎం సుందర్ కుమార్, జబ్బ వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన కార్యక్రమంలో భాగంగా, తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తదుపరి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ శారదాకు సమర్పించారు. ఈ సందర్భంగా యూ,ఎస్, పి,సి స్టీరింగ్ కమిటీ నాయకులు సుందర్ కుమార్, యాదగిరి నాయక్ ప్రసంగిస్తూ మరణ శాసనం రాస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, సౌకర్యాలతో కూడిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డిఇఓ ప్రతి రెవెన్యూ డివిజన్ కు డిప్యూటీ ఈవో పోస్టులు నూతన మండలాలకు ఎంఈఓ రెగ్యులర్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. అన్ని యాజమాన్యాల టీచర్లకు బదిలీలు పదోన్నతులు షెడ్యూల్ను ఆగస్టు 15 లోపు విడుదల చేయాలన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని పండిట్ పీఈటీ పోస్టులను అప్డేట్ చేసి వెంటనే ప్రమోషన్లు కల్పించాలి కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలకు నూతన పోస్టులు మంజూరు చేయాలన్నారు. కేజీబీవీ, యు ఆర్ ఎస్ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం బేసిక్ అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మకాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులు లాగా అన్ని రకాల సెలవు సౌకర్యాలు హెల్త్ కార్డులు వర్తింపజేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జి సంతు జి బాలాజీ నాయక్, షరీఫ్, కబ్బాకుల వెంకన్న, రామనాథం పార్వతి, రాజశేఖర్ (ఫిజిక్స్) కన్నయ్య విజయ రమేష్, వెంకట్రావు లచ్చిరాం ప్రసాద్ రవీందర్ శోభన్ బాబు కిరణ్ కుమార్ లోకేష్ అనిల్ కుమార్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## జమ్మికుంటలో "జనసేన పార్టీ" విస్తృత స్థాయి సమావేశం

- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం జనసేనదే !
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి బండారి రాజ్ కుమార్.

**జమ్మికుంట ఆగస్టు 12 ప్రజాతీర్పు**

జమ్మికుంట పట్టణం పద్మశాలి భవనంలో బుధవారం జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జులు బండారి రాజ్‌కుమార్, కృష్ణప్రియ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతిపక్షాల విమర్శలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జనసేన పార్టీని తెలంగాణలో 'ఆంధ్ర పార్టీ' అని అనవసర విమర్శలు చేస్తున్న ఇతర రాజకీయ నాయకులకు ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. "తెలంగాణలో పోటీ చేస్తున్న ఏ రాజకీయ పార్టీ కూడా కేవలం తెలంగాణకే పరిమితమైనది కాదు. ఈ విషయాన్ని గుర్తించి ఇతర పార్టీల నాయకులు విమర్శలు మానుకోవాలి" అని గళమెత్తి స్పష్టం చేశారు. అవినీతి రహిత పాలనే జనసేన పార్టీ లక్ష్యం. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, అవినీతికి తావులేకుండా నిష్పాక్షికంగా పనిచేసేందుకు జనసైనికులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అవినీతికి పాల్పడకుండా, పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే నాయకులను, ప్రజలను పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి యువత పెద్ద సంఖ్యలో జనసేనలో చేరడానికి ఆసక్తి చూపిస్తున్నారని, వారందరికీ సాదరంగా ఆహ్వానం పలుకుతున్నట్లు వెల్లడించారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, అన్ని స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపుతున్నామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ జెండా ఎగరడం ఖాయమని, ఈ లక్ష్య సాధన కోసం జనసైనికులు మరింత చురుగ్గా, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు యువకులు ఉమ్మడి కరీంనగర్ ఇన్చార్జి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జనసేనపార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టియుఎఫ్ )రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల శ్రీనివాస్ గౌడ్

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఆగస్టు 12:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, తగిన ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఉద్యమకారునికి న్యాయం జరగాలనే సంకల్పంతో టీ యు ఎఫ్ పనిచేస్తుందని అన్నారు. ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేసి రూ.25 వేల పెన్షన్,ఉచిత బస్సు ప్రయాణం, 250 చదరపు గజాల ఇంటి స్థలం, 10 లక్షలు ఇంటి నిర్మాణ ఖర్చులకు అలాగే ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.



## నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలి

**రామడుగు/గంగాధర, ఆగస్టు12 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గ్రామ ప్రజలు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు జాతీయ పరిరక్షణ సమితి కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిరెడ్డి కరుణాకర్ రెడ్డి మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి గ్రామ ప్రజలకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ, రాములు తదితరులు పాల్గొని గ్రామ ప్రజలకు మద్దతు తెలిపారు.

## పెనపహడ్ మండలం నూర్జహాన్ పేట్ గ్రామంలో అనుమానం తో భార్యని హత్యచేసిన భర్త

- నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన సి ఐ రాజశేఖర్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 12**



నేరస్థుడి వివరాలు : బాణోతు రవి, వయస్సు: 40సం.లు, వృత్తి: వ్యవసాయం, గ్రామం: నూర్జహాన్ పేట్ మొర్సుకుంట తండ గ్రామం, పెన్ పహాడ్ మండలం, సూర్యపేట్ జిల్లా

కేసు వివరాలు: గత కొంత కాలంగా నిందితుని భార్య అయిన మృతురాలు అక్రమ సంబంధం పెట్టుకున్నదని అనుమానంతో నేరస్థుడు మృతురాలిని శారీరకంగా మరియు మానసికంగా వేదిస్తుండేవాడు. అలా అనుమానం పెరిగి పలుమార్లు పంచాయతీ పెట్టుకొని కలిసి ఉండేవారు. కానీ నిందితుడి తీరు మార్చుకోక అలాగే పిర్యాదిని వేదిస్తూ చంపాలి అనుకోని తేదీ: 10.08.2026 రోజున రాత్రి సుమారు. 09.00 గంటల సమయంన మృతురాలు షాపు వద్దకు వెళ్ళి వస్తుండగా నేరస్తుడి ఇంటి మూల మలుపు వద్దకు రాగానే నేరస్థుడు మృతురాలిని బలంగా నెట్టివేయగా కింద పడి తలకు వెనుక భాగం న గాయం అయి పడిపోగా అంతటితో ఆగకుండా నేరస్థుడు మృతురాలి పైకి వెక్కి చెప్పులు కల కాళ్లతో మెడ మరియు ఛాతీ పై పలుమారు తొక్కి చంపినాడు. ఇట్టి కేసులోని నెరస్థుడిని సూర్యాపేట జిల్లా ఎస్పీ గారి ఆదేశాల సూర్యాపేట డి.ఎస్.పి గారి పర్యవేక్షణలో సూర్యాపేట రూరల్ సి ఐ గారు, పెన్ పహాడ్ ఎస్ ఐ గారు మరియు సిబ్బంది కలిసి నేరస్తుడు అయిన బాణోతు రవి ని ఈ రోజు తేదీ 12.08.2026 న అతని ఇంటివద్ద పట్టుబడి చేసి అరెస్ట్ చేయనైనది.

# డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పనుల్లో స్పీడు పెంచాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- అర్హులకే ఇండ్లు ఇస్తాం.. లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తున్నాం
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్ , ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 12**



హుజుర్ నగర్ డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, చిన్న చిన్న లోపాలు ఉన్నా వెంటనే రెక్టిఫై చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హుజుర్ నగర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

### ప్రతి బ్లాక్‌లో ఇన్స్పెక్షన్లు..

ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతీ బ్లాక్‌ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి, వాటి జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని సూచించారు.

### తెలంగాణ పబ్లిక్ స్కూల్ పనులు వేగవంతం

ఇండ్ల సముదాయం ప్రాంగణంలో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన పునాది పనులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు.

### 1,805 మందితో తాత్కాలిక జాబితా

ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా ప్రాథమికంగా 1,805 మంది అర్హులైన లబ్ధిదారులతో జాబితాను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అయితే ఈ జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను ప్రత్యేక బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. అర్హత లేని వారి పేర్లు ఉంటే తొలగిస్తామని, నిజమైన పేదలకు మాత్రమే ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు పిడి హౌసింగ్ జబ్బర్ హేహ్మద్, తహసిల్దార్ కవిత మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, గుద్దేదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)**

భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు. ఈ నెల 15వ తేదీన జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న భారత స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయిస్తున్నామని తెలిపారు. డయాస్, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు, సౌండ్ సిస్టం, అవసరమైన మేర కుర్చీలు, త్రాగునీటి సరఫరా వంటి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సిరిసిల్ల శ్రీధర్ బాబు, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## యువత తమ హక్కులను తెలుసుకోవాలి

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) ఆగస్టు 12**

బుధవారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం -- 2026 సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి.బి.పుష్పలత గారి ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, ఇూరూ శ్రీ. పి.లక్ష్మణాచారి గారి సమన్వయంతో జీూ+=×ు× ూెష్ట్రవఎవ, 2025లో భాగంగా "జుఎజూశీషవతీవస ‾శీఠ్ష్ట" (సాధికారిత యువత) అనే ఇతివృత్తంతో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యువతలో చట్టపరమైన అవగాహన, హక్కులు--బాధ్యతలపై చైతన్యం, న్యాయ సహాయం పొందే విధానం, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాల్సిన అవసరం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జీూ+=×ు× ూెష్ట్రవఎవ, 2025 ద్వారా యువతను న్యాయపరంగా, సామాజికంగా మరియు బాధ్యతాయుతంగా సాధికారులను చేయడం, వారికి న్యాయ సేవలు మరియు అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి.చీ.రమాదేవి, లోక్ అదాలత్ సభ్యులు/న్యాయవాదులు శ్రీ.గుర్రం ఆంజనేయులు, న్యాయవాదులు శ్రీ.కుంట శ్రీనివాస్, శ్రీమతి.అరుణ రాఘవపురం, బూర మధుసూదన్, పారా లీగల్ వాలంటీర్ మోర శైలజ, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 12**

భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపుమేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా బుధవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన భగత్ సింగ్ విగ్రహానికి మరియు అమరజీవి మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ విగ్రహానికి పూలమాలలు వేసి పోరు యాత్రను ప్రారంభించి ఈ సందర్భంగా రాష్ట్ర సిపిఐ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకట స్వామి, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ గార్లు మాట్లాడుతూ ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి దేశమంతట ప్రజలను చైతన్యపరచుటకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగినది. సార్వత్రికవిద్య ప్రజల ఆరోగ్యం గురించి వైద్యం ప్రభుత్వమే నిర్వహించాలని యువకులకు ఉపాధి కల్పించాలని ధరల పెరుగుదల అరికట్టాలని పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని దళిత ఆదివాసీలపై ఆకృత్యాలను దాడులను నిలిపివేయాలని మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని కార్మిక హక్కులను పరిరక్షించాలని బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరీక్షించాలని అలాగే బెల్లంపల్లి పట్టణంలో రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోయిన వారికి వెంటనే వారికి ఉపాధి కల్పించాలని బెల్లంపల్లి పట్టణము చుట్టూ ఉన్న ఖాళీ భూములను రియల్ ఎస్టేట్ లు కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారు ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి వెంటనే ఆపాలని క్రమంగా మంచినీరు సరఫరా చేయాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు రాలు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, బి కే యం యు జాతీయ సమితి సభ్యులు అక్కెపల్లి బాబు, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ తాండూరు మండల కార్యదర్శి కొల్లు బానేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడి పోషశీ, బి కే యం యు జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బొల్లం సోని, జిల్లా సమితి సభ్యులు డిఆర్ శ్రీధర్, బొల్లం తిలకంబెడ్కర్, రత్నం రాజం, మేకల రాజేశం, మంతెన రమేష్, ఫిట్ కార్యదర్శిలు రత్నం ప్రవీణ్ కుమార్, వడ్డె మల్ల రాజేందర్, లక్ష్మీనారాయణ, జిల్లా ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులు బొంకూర్ రామచందర్, నాయకులు జూపాక కొమురయ్య, బండారు శంకర్, అందుగుల రాజేందర్, స్వామి దాసు, కే తిరుపతి, చంద్రయ్య, నర్సింగ్, గుండా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీ సాధనకు సెప్టెంబర్ 1న 51 వేల మంది ఉపాధ్యాయులతో మహాధర్నా

- పీఆర్టీయూటీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 12.**



ధర్మపురి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించిన పీఆర్టీయూటీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు ఉపాధ్యాయులను సంఘంలో సభ్యత్వం నమోదు చేయిస్తూ, ఉపాధ్యాయుల ప్రధాన సమస్యల పరిష్కారానికి ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్రంగా నిర్లక్ష్యం చేసి వారి సమస్యలను పట్టించుకోకపోవడంతో దాని ఫలితాన్ని అనుభవించిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మూడు సంవత్సరాలు గడిచినా పీఆర్సీ ప్రకటించకపోవడం విచారకరమని విమర్శించారు. ఉపాధ్యాయుల డిమాండ్లలో 51 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీ, సీపీఎస్ రద్దు, సర్వీస్ రూల్స్ అమలు, మహిళా ఉపాధ్యాయులకు 180 రోజుల చైల్డ్ కేర్ లీవ్,317 జి ఓ సమస్య పరిష్కారం అలాగే అన్ని శాఖల్లో ఉన్న ఖాళీలకు వెంటనే జాబ్ చార్జ్ విడుదల వంటి ప్రధాన అంశాలు ఉన్నాయని తెలిపారు. ఈ డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 1న రాష్ట్ర రాజధానిలో సుమారు 51 వేల మంది ఉపాధ్యాయులతో మహాధర్నా నిర్వహిస్తున్నామని, అందుకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మహాధర్నాను విజయవంతం చేయడం ద్వారానే మన సమస్యలను పరిష్కరించగలమని ధర్మపురి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు వేణుగోపాల్ కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు గణేష్ శివ ప్రసాద్ మండల బాధ్యులు నారాయణ పాల్గొన్నారు



# టీబి ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 12**

బుధవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని శంశీరునగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 65 డి.పి నందు టిబి ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం డిఎంహెచ్వో డాక్టర్.నరేందర్ రాథోడ్, డిప్యూటీ డిఎంహెచ్వో మరియు ప్రోగ్రాం అధికారి డాక్టర్.సుధాకర్ నాయక్, ఆదేశానుసారం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతి రమేష్, క్షయవ్యాధి సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్ అక్కడ హాజరైన రోగులు, ప్రజలతో మాట్లాడారు. ఆయన క్షయ వ్యాధి నివారణకై అవగాహన కల్పిస్తూ రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా,అనుమానించాలన్నారు తగిన జాగ్రతలు పాటించాలని దీంట్లో భాగంగా పోస్టర్లని అవగాహన కొరకు విడుదల చేసి ప్రజల ముందు ఆవిష్కరించారు.జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడ పరీక్షలు, ఎక్స్ రే పరీక్ష ఉచితంగా చేస్తున్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల 1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని, అందుకు అన్ని రకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గం అన్నారు. సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు అని తెలిపారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో అవసరం ఉన్నవారికి అన్ని రకాల పరీక్షలు చేశారు. అలాగే తెమడ పరీక్ష కోసం 9మందికి, హెచ్ఐవి,షుగర్ టెస్టులు, ఎక్స్ రే అవసరం ఉన్నవారికి 86మందికి ఇంటికి దగ్గరలోకి పోర్టబుల్ ఎక్స్ రే యంత్రం ద్వారా 65 డి.పి ఏరియాలో ఎక్స్ రే తీయడం జరిగింది. ఈ శిబిరంలో మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్, స్థానిక 8వ వార్డ్ కౌన్సిలర్ నిజాముద్దీన్, డివిజన్ క్షయవ్యాధి సూపర్ వైజర్ శ్రీపెల్లి శశికాంత్, ఏఎన్ఎం, స్నేహ, ఆశవర్కర్లు సరిత,సమ్మక్క, గంగారాణి,పద్మ తదితరులు సేవలందించారు.




# తండ్రిని హత్య చేసిన కుమారుడు.. మిస్సింగ్ కేసుగా చిత్రీకరణ

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 12**

మిస్సింగ్ కేసుగా చిత్రీకరించి పథకం ప్రకారం తండ్రిని హత్య చేసి మృతదేహాన్ని తగులబెట్టిన కేసులో కుమారుడు భీమిని ఉదయ్ (23)ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల జిల్లా జైపూర్ సీఐ నవీన్ కుమార్ తెలిపారు.తేదీ 11-08-2026న భీమారం పోలీస్ స్టేషన్‌లో నిందితుడు భీమిని ఉదయ్‌ను,విచారించగా,తండ్రి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించినట్లు సీఐ తెలిపారు.సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు ప్రేమ వివాహం చేసుకోవడం తండ్రి లక్ష్మణ్‌కు ఇష్టం లేకపోవడంతో, అతను తరచూ నిందితుడిని,అతని భార్యను దూషిస్తూ ఇబ్బందులకు గురిచేసేవాడు.ఈ నేపథ్యంలో నిందితుడు కిష్టంపేట నుంచి భీమారంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చి అక్కడ ఉంటున్నాడు.ఈ క్రమంలో 21-07-2025న లక్ష్మణ్ భీమారంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చి నిందితుడి భార్యను దూషిస్తూ గొడవకు దిగాడు. దీంతో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నిందితుడు తన తండ్రిని బైక్‌పై భీమారం శివారులోని గొల్లవాగు ప్రాజెక్టు ప్రాంతానికి,తీసుకెళ్లాడు. అక్కడ అతని గొంతు పిసికి హత్య చేసి, మృతదేహాన్ని చెట్ల పొదల్లో పడవేసి పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు విచారణలో వెల్లడించాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి వెళ్లిపోయి, తన తండ్రి కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులతో కలిసి వెతికినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో లక్ష్మణ్ అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేయించి మిస్సింగ్ కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. తేదీ 30-07-2025న గొల్లవాగు అటవీ ప్రాంతంలో మృతదేహం లభించగా, మృతదేహంపై ఉన్న దుస్తులు,చెప్పులు తదితర ఆనవాళ్ల ఆధారంగా అది లక్ష్మణ్ మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడు హత్యకు,ఉపయోగించినట్లు తెలిపిన ఎరుపు రంగు హీరో గ్లామర్ బైక్ (టీఎ01జుదీ8338) ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.తాను తన తండ్రిని హత్య చేసిన ప్రదేశాన్ని చూపిస్తానని నిందితుడు తెలిపినట్లు సీఐ నవీన్ కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజేందర్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ను పరామర్శించిన ఎన్ హెచ్ ఆర్ సి (ఎన్జీఓ) కమిటీ సభ్యులు

**నర్సంపేట టౌన్ ఆగస్టు 12 ప్రజా తీర్పు**



నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మరియు వరంగల్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ కాలు జారి కింద పడి గాయాలు కావడం జరిగింది. ప్రస్తుతం నర్సంపేట పట్టణంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న నర్సంపేట టౌన్ సెక్రటరీ గాండ్ల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్లు గుండు బాబ్జీ, కర్రి శివాజీ, మద్దెల శ్యామ్ కుమార్, కమిటీ సభ్యులు వంగలపుడి శ్రీనివాస్, వడిచర్ల రమేష్ లు జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ను కలిసి పరామర్శించడం జరిగిందని అన్నారు.

## సర్వాపురం ప్రాథమిక పాఠశాలలో పారిశుద్ధ్య పనులు చేపించిన కౌన్సిలర్- బాణాల ప్రసన్న శ్రీనివాస్

**నర్సంపేట టౌన్ ఆగస్టు 12 ప్రజాతీర్పు**



నర్సంపేట పట్టణంలోని 22వ వార్డు మహబూబాబాద్ రోడ్డు సర్వాపురం ప్రాథమిక పాఠశాలలో స్థానిక కౌన్సిలర్ బాణాల ప్రసన్న శ్రీనివాస్ మున్సిపాలిటీ జవాన్ గజ్జల మహేందర్ సహకారంతో పారిశుద్ధ్య కార్మికులను నియమించి ప్రాథమిక పాఠశాలలో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని చెట్లను స్వాతంత్ర దిన వేడుకలను, పాఠశాల విద్యార్థిని విద్యార్థులను దోమల బారి నుండి రక్షించుటలో భాగంగా పాఠశాల ఆవరణ మొత్తం శుభ్రం చేయించడం జరిగినది బాణాల ప్రసన్న శ్రీనివాస్ 22వ వార్డు కౌన్సిలర్ నర్సంపేట

# ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం

- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం
- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 12,(ప్రజా తీర్పు):**



అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్నకొండ సాయి ఆజాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్యఅతిథిగా హాజరై శ్వేత--అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ.. 1936 ఆగస్టు 12న లక్నోలో ఏర్పాటైన ఏఐఎస్ఎఫ్ దేశంలోనే తొలి విద్యార్థి సంఘమని తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఏఐఎస్ఎఫ్ అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. మెస్, కాస్మోటిక్ ఛార్జీలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, గురుకుల విద్యార్థులకు సొంత భవనాలు కేటాయించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ఉంటుందని ప్రీతం అన్నారు. జిల్లా సమితి ఇచ్చే పిలుపులకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉద్యమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లాలోని 14 మండలాల్లో శ్వేత--అరుణ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మనీషా, శ్రావణి, ఉర్మిళ, అశ్విని, స్వాతి, శ్రీయ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 31లోగా చేయూత పెన్షన్ల పూర్తి డేటా సేకరణ

**జమ్మికుంట, ఆగస్టు 12 ప్రజాతీర్పు**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో చేయూత పెన్షన్లకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరి పూర్తి వివరాలను ఆగస్టు 31, 2026లోగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ఆదేశించారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ జి. మల్లికార్జున స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ ములుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి వార్డులో కౌన్సిలర్ల సహకారంతో వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి చేయూత పెన్షన్లపై వివరాలు సేకరించాలని సూచించారు.ప్రతి వార్డులో పెన్షన్ అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ పొందని వారిని గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని తెలిపారు. చేయూత పెన్షన్లలో వితంతు, ఒంటరి మహిళ, వికలాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు తదితర అర్హులైన వారు ఎవరైనా పెన్షన్ పొందకుండా ఉన్నట్లయితే వారిని గుర్తించి, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక పెన్షన్ దరఖాస్తు కేంద్రం ఏర్పాటు చేయడమైనది.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకం అందేలా ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి, ఎలాంటి అర్హుడు కూడా పథకానికి దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, ఏఈ వికాస్, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, టీపీబీవో దీపిక, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శ్రీనివాస్, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి అండగా కౌన్సిలర్

- ఆర్థిక సాయం అందించిన కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత-నరేష్ గౌడ్

**జమ్మికుంట ఆగస్టు 12 ప్రజాతీర్పు**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో గల హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన సీర్ల అనిత రాణి అనారోగ్యంతో మృతి చెందగా ఆరవ వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత-నరేష్ గౌడ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.గత రెండు నెలలుగా అనారోగ్యం బారినపడగా కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం హైదరాబాద్ కు తరలించగా బుధవారం ఉదయం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. వారు హౌసింగ్ బోర్డ్ కాలనీలో గత 30 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటూ ప్రైవేటు నర్సుగా పని చేసేవారు. నిరుపేద కుటుంబానికి చెందిన సీర్ల అనిత రాణి దహన సంస్కారాల ఖర్చు కోసం వారి కుమారులైన గోపి సాయి లకు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత-నరేష్ గౌడ్ రూ 5000 ఆర్థిక సహాయం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హోదార్చి ధైర్యం చెప్పారు.



# మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన

- మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకోవాలి: ప్రజా సంఘాల నాయకులు

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 12, (ప్రజాతీర్పు):**

పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం రామగిరి మండలం ముత్యాల గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డా. బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మాన్యవార్ కాన్షీరామ్, కొమురం భీమ్, బిర్సా ముండా, చాకలి ఐలమ్మ తదితర 12 మంది మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు బుధవారం స్థల పరిశీలన నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య--నాగరాజు దంపతుల ఆధ్వర్యంలో ముత్యాల గ్రామానికి వెళ్లే కమాన్ సమీపంలోని ప్రధాన రహదారి వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దళిత, బహుజన, అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక చైతన్యం కోసం జీవితాలను అంకితం చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విగ్రహాల ఏర్పాటుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు మంథని ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అవసరమైన సహకారం అందించాలని కోరారు. స్థల పరిశీలనలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైసా రాజయ్య, సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సమతా ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ డా. దుర్గం నగేష్, తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, పెద్దపల్లి జిల్లా నాయకులు పొనుగంటి రాజనర్స్, బూడిద సమ్మయ్య, మేకల సురేష్, రామగిరి రమేష్, ధర్మారం మండల అధ్యక్షుడు కాంపల్లి జీవన్‌కుమార్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# కేఎల్ మహేంద్ర 19వ వర్ధంతి ఘనంగా నిర్వహణ

**(రాంపల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలశీ ప్రతినిధి)**

గోలేటి : సింగరేణి కార్మికోద్యమ దిగ్గజం, కమ్యూనిస్టు నాయకుడు కేఎల్ మహేంద్ర 19వ వర్ధంతిని బుధవారం బెల్లంపల్లి ఏరియా గోలేటి బ్రాంచ్‌లోని కేఎల్ మహేంద్ర భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్మికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. కార్మికుల హక్కుల సాధన కోసం కేఎల్ మహేంద్ర జీవితాంతం అలుపెరగని పోరాటం చేశారని నాయకులు పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు కంపెనీ లాభాల్లో వాటా సాధించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేఎల్ మహేంద్ర ఆశయాలను కొనసాగిస్తూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి. జగ్గయ్య, జూపాక రాజేష్, మారం శ్రీనివాస్, ఆదాం సమీ, ఏ. ఆఫ్రిద్, ట్రెజరర్ మీస చంద్రశేఖర్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం బ్రాంచ్ కార్యదర్శి సల్లూరి అశోక్, సహాయ కార్యదర్శి సాగర్ గౌడ్, యూనియన్ నాయకులు పుట్ట అంజయ్య, ఎన్. గణేష్, రారాజు, ఎల్ల రమేష్, పరికిపండ్ల రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



# గడువులోగా సీఎంఆర్ రైస్ సరఫరా పూర్తి చేయాలి

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 12,(ప్రజా తీర్పు)**

రబీ 2024--25 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యం సరఫరాను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సీఎంఆర్ రైస్ డెలివరీపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు నాణ్యమైన రా, పాలిష్డ్ రైస్‌ను సరఫరా చేయాలన్నారు. మిల్లుల్లో నాణ్యతకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించి సీఎంఆర్‌ను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రైస్ మిల్లర్లు రోజువారీ రిజిస్టర్లు నమోదు చేయాలని, గన్నీ సంచుల కోతలు, నంబర్ల నమోదులో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సమన్వయంతో మెరుగైన వైద్య సేవలు

- అవసరాలకు అనుగుణంగా సిబ్బంది సర్దుబాటు చేయాలి
- పారిశుధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 12 (ప్రజాతీర్పు)**

జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యారోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రుల అవసరాలకు అనుగుణంగా సిబ్బంది నియామక ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు అందుబాటులో ఉన్న సిబ్బందిని అవసరమైన ఆసుపత్రులకు సర్దుబాటు చేయాలని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చూడాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర వైద్యం అవసరమైన వారికి తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ: ప్రభుత్వ ఆసుపత్రుల పరిసరాలు, వార్డులు, వైద్య గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బయోమెడికల్, ఇతర వ్యర్థాలను నిబంధనల ప్రకారం సురక్షితంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రుల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తం: సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పారిశుధ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ వ్యాధుల వ్యాప్తికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల నుంచి వచ్చే వైద్య సేవల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ పవిత్ర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీధర్, సుల్తానాబాద్ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమాదేవి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాత గొడవల నేపథ్యంలో యువకుడిపై దాడి - కేసు నమోదు

**బీర్పూర్.ఆగస్టు12 (ప్రజా తీర్పు )**

బీర్పూర్ మండలంలోనితుంగూరు గ్రామానికి చెందిన చుక్క మధుకర్‌ను పాత గొడవలను మనసులో పెట్టుకొని, తేదీ 11-08-2026 న సాయంత్రం సమయంలో ఓరగంటి బన్నీ మరియు బట్టపెల్లి జస్వంత్‌లు ఫోన్ చేసి పల్లె ప్రకృతి వనం వద్దకు రావాలని పిలిచారు. మధుకర్ అక్కడికి వెళ్లిన అనంతరం, గుడిసె ప్రశాంత్ మరియు కొలుమల కృష్ణవంశీ అనే వ్యక్తులు అతనిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, చేతులతో మరియు చేతి కడెం తో కొట్టినట్లు ఫిర్యాదు అందింది. ఫిర్యాదు మేరకు బీర్పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు ఎస్సై రాజు తెలిపారు .

# అంగన్వాడీ కేంద్రంలో మదర్స్ కమిటీ సమావేశం

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలశీ ప్రతినిధి)**



తాండూర్ మండలం మాదారం గ్రామంలోని అంగన్వాడీ సెంటర్--3 లో అంగన్వాడీ టీచర్ మీనా ఆధ్వర్యంలో బుధవారం మదర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాదారం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు పొట్లంచర్ల సౌమ్య, గొల్లపల్లి బానేష్, కత్తర్ల రవికుమార్ యాదవ్, గోదాల లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మదర్స్ కమిటీ సభ్యుల సమక్షంలో అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, అంగన్వాడీ టీచర్ పనితీరు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు మరియు ఇతర లబ్ధిదారులకు అందుతున్న పౌష్టికాహారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి నెల మదర్స్ కమిటీ సభ్యులు క్రమం తప్పకుండా సమావేశమై అంగన్వాడీ కేంద్రం పనితీరును సమీక్షించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహణలో లేదా లబ్ధిదారులకు పంపిణీ చేసే సరుకుల విషయంలో ఏవైనా లోటుపాట్లు, సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా తీసుకునేలా చూడాలని, అంగన్వాడీ సేవలను ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం లబ్ధిదారులకు సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ చేతుల మీదుగా పౌష్టికాహార సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ తాండూరి మల్లీశ్వరి, మదర్స్ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట నుండి ఆర్టీసీ ప్రత్యేక గోవా యాత్ర

**నర్సంపేట రూరల్, ఆగస్టు 12, ప్రజా తీర్పు ప్రతినిధి:**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో నుండి ఆగష్టు 15వ తేది ఉదయం 05గంటలకు 36సీట్లు గల సూపర్ లగ్జరి బస్సు ప్రత్యేక టూర్ ప్యాకేజిలో భాగంగా గోవా యాత్ర ఉంటుందని డిపో మేనేజర్ ఎం. సరస్వతి ఒక ప్రకటనలో తెలియజేసారు ఈ బస్సు హైదరాబాద్ నుండి హంపి క్షేత్రం ద్వారా కర్ణాటక లోని కుక్కే సుబ్రహ్మణ్ణేశ్వరా టెంపుల్, దర్మస్థల, ఉడిపి నుండి మురుడేశ్వర్, గోకర్ణ దైవ దర్శనాల తర్వాత గోవా కి వెళ్లడం జరుగుతుంది. గోవా యందు ఒక రోజు సమయం ఉంటుంది అనంతరం హైదరాబాద్ నుండి నర్సంపేట కి గురువారం 20వ తేదీన రాత్రి 12గంటల వరకు చేరుకుంటుంది. ఒక్కరికి 5500/-ప్రయాణం చార్జి 05రోజుల యాత్ర భోజనం మరియు వసతి గదుల ఖర్చు బాధ్యత పర్యాటకులదే ముందస్తు బుకింగ్.కొరకు 9704644543ని సంప్రదించిఇట్టిసదావకాశాన్ని పర్యాటకులు సద్వినియోగంచేసుకోవాలని ఆమె కోరారు.



# పిహెచ్‌సీ ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్న ఎం పి హెచ్ సి ఓ యాకస్వామి

- సొంత నిధులతో హాస్పిటల్ రూపురేఖలు మార్చేందుకు కృషి
- విషసర్పాల భయం లేకుండా పరిసరాల పరిశుభ్రత
- ఆగస్టు 15 వేడుకల కోసం ప్రత్యేక జెండా గద్దె నిర్మాణం

**నర్సంపేట రూరల్,ఆగస్టు 12, ప్రజా తీర్పు ప్రతినిధి:**

స్థానిక భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీ హెచ్ సీ అసిస్టెంట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ ఎం పి హెచ్ సి ఓ యాకస్వామి తన స్వచ్ఛంద సేవతో ప్రశంసలు అందుకంటున్నారు. ఎం పి హెచ్ సీ ఓ ప్రాంగణంలో గత కొంతకాలంగా పిచ్చిమొక్కలు, దట్టంగా పెరిగిన పిచ్చిగడ్డి వల్ల రోగులు, ఆస్పత్రి సిబ్బంది విషక్రిములు, పాముల భయంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ?ఈ సమస్యను గుర్తించిన ఎం పి హెచ్ సి చొరవ తీసుకుని, ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను, గడ్డిని తొలగించి శుభ్రం చేయిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా, రాబోయే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం తన సొంత డబ్బులతో ప్రత్యేకంగా జెండా గద్దెను ఏర్పాటు చేస్తున్నారు.?ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు తన వంతు బాధ్యతగా సొంత నిధులు వెచ్చించి ఆస్పత్రి రూపురేఖలుమారుస్తుండడంపై స్థానిక ప్రజలు, ఆస్పత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులైనా,ఉద్యోగులైనా బాధ్యతతో పాటు సమాజ సేవ దృక్పథం ఉంటే ఆస్పత్రుల రూపురేఖలు మారుతాయని యాకస్వామి ఉదారత నిరూపిస్తోందని స్థానికులు కొనియాడారు.



# ఘనంగా బీఆర్ఎస్ నాయకులు కూసాన్ వీరభద్రం జన్మదిన వేడుకలు

**కొత్తగూడెం, ఆగస్టు 12 (ప్రజా తీర్పు):**

చుంచుపల్లి మండల పరిధిలోని బాబు క్యాంప్ గ్రామ మాజీ ఎంపీటీసీ, టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కూసాన్ వీరభద్రం 64వ జన్మదిన వేడుకలు బుధవారం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూసాన్ వీరభద్రం కుటుంబ సభ్యులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మంథని జూనియర్ కళాశాలలో మల్లేపల్లి డిగ్రీ తరగతులు

**మంథని, ఆగస్టు-12 (ప్రజాతీర్పు)**



మల్లేపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థుల రాకపోకల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఖాళీగా ఉన్న మొదటి అంతస్తులో తాత్కాలికంగా తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం కళాశాలను పరిశీలించిన ఆయన అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సైహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మోదుగుల గూడెంలో అంగ రంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి సంబరాలు

- గ్రామ సర్పంచ్ చింతమల్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాల్లో గ్రామ ప్రజలు...

**కురవి ఆగస్టు 12(ప్రజా తీర్పు విలేఖరి)**

కురవి మండలం లోని మోదుగుల గూడెం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి బోనాలు స్థానిక సర్పంచ్ చింతమల్ల ప్రవీణ్ కుమార్,ఉపసర్పంచ్ దయ్యాల శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మోదుగుల గూడెం గ్రామంలో అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి సంబరాలు నిర్వహించారు.కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భావించే గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి కీ మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు.మహిళలు ఉపవాస దీక్ష చేపట్టి,ఎలాంటి ఇబ్బందులూ లేకుండా,ఎలాంటి ఇబ్బందులూ లేకుండా, అనారోగ్య సమస్యలు లేకుండా చూడాలని,పిల్లా పాపలను చల్లగా దీవించి ముత్యాలమ్మ తల్లి కి మొక్కులు చెల్లించుకుంటూ, అనంతరం బోనం సమర్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు ఐలి నరహరి, మాజీ సర్పంచ్ గండి నాగలక్ష్మి - వెంకటమల్లు,శామల అశోక్ కుమార్,గుండీలు పుల్లయ్య,మాధ శ్రీకాంత్, యూత్ నాయకులు స్థానికులు మహిళ భక్తులు, తదితరులు పాల్గొన్నారు

# మేడ్చల్-మల్కాజిగిరిలో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సమీక్ష: 15 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆదేశం

## అదనపు జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాలు) డి. విజయేందర్ రెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ జిల్లా ప్రతినిధి) ఆగష్టు 12**



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఖరీఫ్ 2026-27 కాలానికి సంబంధించిన ధాన్యం సేకరణపై అదనపు జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాలు) డి. విజయేందర్ రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎల్. సుగుణ బాయి, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఎండీ రియాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా అదనపు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రైతుల సౌకర్యార్థం 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కొనుగోళ్లకు అవసరమైన గన్నీ సంచులను తగినంత స్థాయిలో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**సమావేశంలో కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలు:**

?రైతులకు అవగాహన: ధాన్యంలో తడి, తాలు, దుమ్ము లేకుండా శుభ్రపరిచి, బాగా ఆరబెట్టిన వడ్లనే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి. హార్వెస్టర్ల యజమానులతో సమన్వయం: వరి కోతల సమయంలో నూర్పిడి యంత్రాల (హార్వెస్టర్లు) యజమానులతో సమన్వయం చేసుకుంటూ, ధాన్యం క్రమపద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు చేరేలా చర్యలు తీసుకోవాలి. అదే రోజు ట్యాబ్ ఎంట్రీ: ట్యాబ్ ఎంట్రీలలో ఆలస్యం జరగడం వల్ల రైతులకు చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని, కాబట్టి ఏ రోజు ఎంట్రీలను ఆ రోజే పూర్తి చేయాలని ఏఈఓలు, కేంద్రాల ఇన్‌చార్జీలకు స్పష్టం చేశారు. 48 గంటల్లోనే చెల్లింపులు: ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలోనే నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేయబడుతుందని తెలిపారు. రైతుల సమస్యల తక్షణ పరిష్కారానికి జిల్లా స్థాయిలో నిరంతర సమీక్షలు ఉంటాయన్నారు. అధికారులందరూ పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయడం ద్వారా జిల్లాకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అదనపు జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యలు గాలికి వదిలేసిన అధికారులు సర్వసభ్య సమావేశానికి డుమ్మా అధికారులకు నోటీసులు

- సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరుకాని అధికారులు సర్పంచులు, అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.
- సమావేశానికి హాజరు కాకపోతే నిధులు ఎక్కడి నుంచి వస్తాయి గ్రామ సమస్యలు ఎలా తెలుస్తాయి?
- పోలీస్, ఉద్యానవన, రోడ్డు,రవాణా, అటవీ శాఖలకు నోటీస్.

**(వంజరపు ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) ఆగస్టు 12**



మెదక్ జిల్లా పరిధిలోని మాసాయిపేట్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కీలకమైన సర్వసభ్య సమావేశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమంపై చర్చించాల్సిన ఈ ముఖ్యమైన వేదికకు కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు గైర్హాజరు కావడం స్థానికంగా కలకలం రేపింది. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులే ఇలా సమావేశానికి డుమ్మా కొట్టడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రాజకీయ వైఖరితో కుంటుపడుతున్న గ్రామాభివృద్ధి: మండల సర్వసభ్య సమావేశం అనేది గ్రామ స్థాయి సమస్యలను నేరుగా వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు లభించే అత్యంత కీలకమైన వేదిక. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ సరఫరా, వ్యవసాయం, సీజనల్ వ్యాధులు, మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అనేక అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చిస్తారు. అయితే, ఈసారి సమావేశానికి కేవలం బిఆర్ఎస్ (దీ=హా) పార్టీకి చెందిన సర్పంచులు మాత్రమే హాజరు కాగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు మాత్రం రాకపోవడం గమనార్హం.

ఈ పరిణామంపై మండల స్థాయి అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సమావేశాలకు హాజరుకాకపోతే, ఆయా గ్రామాలకు కేటాయించాల్సిన నిధులు, 67 అభివృద్ధి ప్రణాళికలు మరియు తక్షణ పరిష్కారాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దీనివల్ల గ్రామాలు మరింత అభివృద్ధికి నోచుకోక, పనులు కుంటుపడే అవకాశాలు ఉన్నాయని వారు స్పష్టం చేస్తున్నారు.

### ప్రజా సమస్యల విస్మరణపై గ్రామస్తుల అసహనం:

ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన సర్పంచులు, రాజకీయాంశాలను పక్కనబెట్టి గ్రామాల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో లేదా వివిధ కాలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఎదురయ్యే తాగునీరు, పారిశుధ్యం, రహదారుల పునర్నిర్మాణం వంటి సమస్యలను పరిష్కరించాలంటే అధికారులతో ప్రజాప్రతినిధుల సమన్వయం ఎంతో అవసరం. ఇటువంటి సమయంలో సర్వసభ్య సమావేశాలను బహిష్కరించడం లేదా గైర్హాజరు కావడం వల్ల గ్రామాల్లో సమస్యలు యథాతథంగా ఉండిపోతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.. సర్వసభ్య సమావేశం అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదా వర్గానికి చెందినది కాదని, అది నియోజకవర్గ మరియు మండల అభివృద్ధికి సంబంధించిన ప్రజా వేదిక అని అధికారులు గుర్తుచేస్తున్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క సర్పంచ్, ఎంపీటీసీ సమావేశాలకు హాజరై తమ తమ గ్రామాల సమస్యలను లేవనెత్తాలని, తద్వారా అధికారుల సమక్షంలో సమస్యలకు పరిష్కారం కనుగొని గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ, మాసాయిపేట్ మండలంలో చోటుచేసుకున్న ఈ పరిణామం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే రోజుల్లో అయినా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించి గ్రామాభివృద్ధికి సహకరిస్తారో లేదో వేచి చూడాలి కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, ఇన్చార్జి ఎంపీడీవో విగ్నేశ్వర్, ఎమ్మార్వో జ్ఞాన జ్యోతి, డి ఎల్ పి ఓ సాయిబాబా, ఎంపీ ఓ నరేష్, మండల సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సింగభూపాలెంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు

**సింగభూపాలెం, ఆగస్టు 12 (ప్రజా తీర్పు)**

తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, విద్యానగర్, కొత్తగూడెం ఆధ్వర్యంలో సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామ కూడళ్లలో రూ. 20 వేల విలువైన ఐదు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. అసోసియేషన్ సభ్యులు సామినేని భాస్కరరావు ఆర్థిక సహకారంతో తన తల్లిదండ్రులు స్వర్గీయ సామినేని నారాయణ, మంగమ్మ జ్ఞాపకార్థం ఈ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగభూపాలెం గ్రామంతో తమకు చిరకాల అనుబంధం ఉందన్నారు. గ్రామంలోని సీనియర్ సిటిజన్స్‌ను గౌరవంగా చూడాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వృద్ధులకు ఉపయోగపడేలా ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను గ్రామ పంచాయతీ సిబ్బంది జాగ్రత్తగా పరిరక్షించి దీర్ఘకాలం వినియోగంలో ఉండేలా చూడాలని కోరారు. అనంతరం అంగన్వాడీ టీచర్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకరూప దుస్తులను అంగన్వాడీ విద్యార్థులకు అందజేశారు. గ్రామ పెద్ద బైరి సాంబయ్య మాట్లాడుతూ గతంలో కూడా అంగన్వాడీ కేంద్రాలకు ఉపకరణాలు అందించారని, ప్రస్తుతం వృద్ధులకు ఉపయోగపడేలా బెంచీలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ సీనియర్ సిటిజన్స్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిన్నెర వెంకన్న, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సుజాతనగర్‌లో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 12 (ప్రజా తీర్పు)**



ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం సుజాతనగర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు కుమారి హనుమంతరావు అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందని, ఎందరో విద్యార్థులు దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వ విద్య పరిరక్షణ, శాస్త్రీయ విద్య, సమాన విద్యా విధానం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తూ, విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏఐఎస్ఎఫ్ పనిచేస్తోందన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలోని అసమానతలను వ్యతిరేకిస్తూ, ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ టౌన్ కార్యదర్శి బొడ్డు కేశవరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు అనిల్ కుమార్, బాలాజీ, మండల నాయకులు నవీన్, సాయి, ధనుష్, రామ్ చరణ్, శివ, అఖిల్ పాల్గొన్నారు.

## ఎన్ .ఐ. ఓ .ఎస్ .ద్వారా 78 మంది ఖైదీలకు ఎస్.ఎస్ . సి .ఉత్తీర్ణత

**(వినోద్, ప్రజా తీర్పు,కుషాయిగూడ,మేడ్చల్ జిల్లా) ఆగస్టు 12**



తెలంగాణ జైళ్ల చరిత్రలో తొలిసారిగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ఎన్ .ఐ. ఓ. ఎస్. ద్వారా 78 మంది ఖైదీలు పదో తరగతి (ఎస్ .ఎస్. సి .) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఖైదీల విద్య, స్వీయాభివృద్ధి, పునరావాసాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జైళ్ల శాఖ చేపట్టింది. ఖైదీలు విద్యను కొనసాగించేలా జైళ్ల శాఖ ఎన్ .ఐ .ఓ .ఎస్. తో అవగాహన ఒప్పందం చేసుకుంది. అనంతరం చర్లపల్లి, నిజామాబాద్ కేంద్ర కారాగారాలతో పాటు హైదరాబాద్ ప్రత్యేక మహిళా కారాగారానికి చెందిన 108 మంది ఖైదీలు గాజులో చేరారు. వారి కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు అవసరమైన చోట ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమించి, వారి వేతనాలను జైళ్ల శాఖ భరించింది. ఏడాది పాటు క్రమబద్ధమైన విద్యా ప్రణాళికలో భాగంగా తరగతులు, మాక్ టెస్టులు, ప్రీ-బోర్డు పరీక్షలు నిర్వహించి ఖైదీలను పరీక్షలకు సిద్ధం చేశారు. ఫలితంగా చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి 56 మంది, నిజామాబాద్ నుంచి 15 మంది, హైదరాబాద్ ప్రత్యేక మహిళా కారాగారం నుంచి ఏడుగురు చొప్పున మొత్తం 78 మంది ఉత్తీర్ణులయ్యారు. జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా, ఐపీఎస్ ఉత్తీర్ణులైన ఖైదీలకు ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఖైదీలు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసాన్ని ఆమె ప్రశంసించారు. విద్య ద్వారా జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే సంకల్పానికి ఈ విజయం నిదర్శనమన్నారు.

### ఉత్తీర్ణులైన 78 మంది ఖైదీలకు ప్రత్యేక రిమిషన్

విద్యపై ఖైదీలు చూపిన కృషి, క్రమశిక్షణకు గుర్తింపుగా ఎన్. ఐ. ఓ. ఎస్. ద్వారా ఎస్ .ఎస్. సి .ఉత్తీర్ణత సాధించిన 78 మందికి డైరెక్టర్ జనరల్ రిమిషన్‌ను ప్రత్యేక ప్రోత్సాహకంగా ప్రకటించారు. ఇతర ఖైదీలు కూడా విద్య వైపు అడుగులు వేయడానికి ఇది ప్రేరణగా నిలుస్తుందని డీజీ పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన ఖైదీలను ఎన్ . ఐ .ఓ . ఎస్ .ద్వారా సీనియర్ సెకండరీ (10+2) విద్య కొనసాగించేలా ప్రోత్సహించనున్నారు. మరో 47 మంది ఖైదీలు తాజాగా ఎస్. ఎస్. సి .లో నమోదు చేసుకున్నారు. 10+2 పూర్తిచేసిన అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా బీఏ కోర్సుల్లో చేరే అవకాశం కల్పించనున్నారు. అలాగే ఎస్ . ఎస్ . సి .ఉత్తీర్ణులైన 78 మంది ఖైదీలు చర్లపల్లి కేంద్ర కారాగారంలోని ఐటీఐలో వివిధ సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించేందుకు అర్హులని డీజీ తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తులో స్వయం ఆధారిత జీవితం వైపు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్. ఐ. ఓ. ఎస్ జాయింట్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ పరంప్రీత్ సింగ్, హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ డా. ప్రవీణ్ చౌహాన్, జైళ్ల శాఖ ఐజీ వై. రాజేష్, డీఐజీలు డా. డి. శ్రీనివాస్, ఎం. సంపత్, పలువురు జైలు సూపరింటెండెంట్లు, అధికారులు, ఎన్. ఐ. ఓ. ఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఖైదీలు పాల్గొన్నారు.



## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**బీర్పూర్ ఆగస్టు12( ప్రజా తీర్పు )**

బీర్ పూర్ మండలం లోని నర్సింహులపల్లి శ్రీ కృష్ణ యాదవ సంఘం లో సీఎం సహాయ నిధి ద్వారా 18 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 10 లక్షల రూపాయల విలువగల చెక్కులను నర్సింహుల పల్లి గ్రామంలో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ లో చెక్కులు పంపిణీ చేసిన అనంతరంఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యధిక పల్లె దవాఖాన లు జగిత్యాల కు మంజూరు అయ్యాయి.వెల్ నెస్ సెంటర్,ట్రామా సెంటర్ ను జగిత్యాల పాత బస్టాండ్ హాస్పిటల్ లో మంజూరు అయ్యాయి. జగిత్యాల పట్టణం లో 235 కోట్ల తో 750 పడకల ఆసుపత్రి నిర్మాణం లో ఉంది. బీర్పూర్ మండలానికి కస్తూర్బా పాఠశాల మంజూరు చేయటం జరిగింది. 200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్ మంజూరు తో నాణ్యమైన వైద్య సదుపాయాలు. బీర్పూర్ ఘాట్ రోడ్డు డబల్ రోడ్డు మంజూరు అయింది.నెల రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. రోల్లవాగు ప్రాజెక్ట్ పనులు త్వరిత గతిన పూర్తి చేస్తాం. సీనియర్ నాయకులు మాజీ మంత్రి గతం లో రోళ్ళ వాగు ప్రాజెక్ట్ విషయం ఎప్పుడైనా మాట్లాడారా,సమస్య పరిష్కారం కోసం చూసారా...ఇప్పుడు కావాలని రాజకీయం చేస్తున్నారని అన్నారు.ప్రజలు రైతులు గమనిస్తున్నారు అని అన్నారు. అటవీ ,ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్ట్ పనులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు... కులం మతం పైన రాజకీయాలు కాదు మన ఆర్థిక వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. ప్రపంచం లో రూపాయి మారకం విలువ తగ్గింది. అర్హులు అందరికీ చేయుత పెన్షన్ ల మంజూరు చేస్తాం. త్వరలోనే వృద్ధాప్య పింఛన్లు కూడా మంజూరు అవుతాయి. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఎల్ నీ నో ప్రభావం ఉంది.రైతులు గమనించాలి అని సూచించారు. డిమాండ్ ఉన్న పంటలు పామ్ ఆయిల్ పంటలను సాగు చేయాలని అన్నారు.

తాగు నీరు పొదుపుగా వాడాలి అని అన్నారు. అర్హులు అందరికీ రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కే డిసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రాంచందర్ రావు,సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజగోపాల్ ,పాక్స్ చైర్మెన్ నవీన్ రావు,స్తానిక సర్పంచ్ సుశీన్ ఎంపిడిఓ భీమేష్ ఎమ్మెర్వో సుజాత సర్పంచులు,ఉప సర్పంచులు, మాజీ సర్పంచులు ,మండల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం: కోల్డ్ రష్ లాజిస్టిక్స్ గోదాంలో ఎగసిపడిన మంటలు

**(వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ జిల్లా ప్రతినిధి) ఆగస్టు 12**



మేడ్చల్ జిల్లా తుంకుంట దేవరాయాంజాల్‌లోని 'కోల్డ్ రష్ లాజిస్టిక్స్' గోదాంలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. గోదాంలో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగి, క్షణాల్లోనే ఎగసిపడ్డాయి. ప్రమాద తీవ్రతకు దట్టమైన నల్లటి పొగలు ఆకాశాన్ని ముంచెత్తడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఆలస్యం? ప్రమాదం జరిగిన సుమారు రెండు గంటల పాటు మంటలు విచ్చలవిడిగా చెలరేగాయని, ఫైర్ ఇంజన్లు ఆలస్యంగా ఘటనా స్థలానికి చేరుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం రెండు అగ్నిమాపక యంత్రాల సహాయంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కారణాలు తెలియాల్సి ఉంది ఈ అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. అలాగే ఎంత మేర ఆస్తి నష్టం జరిగిందనే దానిపై అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అగ్నిమాపక అధికారులు పూర్తి వివరాల కోసం దర్యాప్తు వేగవంతం చేశారు.

## ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన

**హుస్నాబాద్ ఆగస్టు 12 రవీందర్ ప్రజా తీర్పు**



హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్- -2016పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి దండి లక్ష్మి మాట్లాడుతూ, ప్రజలు తమ ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను నాలుగు రకాలుగా తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్త మరియు శానిటరీ చెత్తను వేర్వేరుగా చేసి, పురపాలక సంఘ వాహనాలకు అందించాలని తెలిపారు. పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి చిత్తారి పద్మ , కౌన్సిలర్లు బొల్లిశెట్టి రాజు , సంపత్ , వరప్రసాద్ , బొల్లి శ్రీనివాస్ , వైద్యం కిరణ్ ప్రసాద్ , గాదెపాక రవీందర్, బత్తుల స్వరూప , మున్సిపల్ అధికారులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం , టీపీఎస్ సంధ్య , శంకర్, శివకుమార్, రవికుమార్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నాపై వచ్చిన ఆరోపణలు నిరాధారమే.. దళిత నాయకుడు తగరం శంకర్ లాల్

**మంథని, ఆగస్టు-12 తనపై (ప్రజాతీర్పు)**



వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని, రాజకీయంగా తన ఎదుగుదలను ఓర్వలేకనే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని దళిత నాయకుడు తగరం శంకర్ లాల్ పేర్కొన్నారు. బుధవారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దీనికి సంబంధించి ప్రజలకు, మీడియా మిత్రులకు వాస్తవాలు తెలియజేయడానికే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తన ఎదుగుదలను ఓర్వలేక అసత్య ఆరోపణలు చేసి తన రాజకీయ భవిష్యత్తుపై దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తనపై అసత్య ఆరోపణలు చేసి తన కుటుంబాన్ని, తనను మానసికంగా, రాజకీయంగా దెబ్బతీసే ప్రయత్నం చేశారని అన్నారు. తన సతీమణి జెడ్పీటీసీగా ఉన్న సమయంలో పార్టీ మారితే తనకు మంచి అవకాశం ఉన్నప్పటికీ, వాటన్నింటినీ వదులుకుని దేనికీ ఆశపడకుండా నిబద్ధతతో ఉన్నానని శంకర్ లాల్ పేర్కొన్నారు. తనపై మోపిన ఆరోపణల విషయంలో న్యాయస్థానంలోనే తేల్చుకుంటానని, న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని తెలిపారు. ప్రజలు తనకు ఇచ్చిన మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ ప్రజా సేవను కొనసాగిస్తానని శంకర్ లాల్ తెలిపారు. ఈ సమావేశంలో తగరం సుమలత, వేమునూరు జక్కయ్య, నౌల్ల సంపత్ మహారాజ్, బొబ్బిలి వెంకన్న, పులి రామన్న, గద్దల శంకర్, ఊట్ల శ్రీనివాస్, బొడ్డు రాజబాబు, చిట్యాల సమ్మయ్య, మంథని సుధాకర్, ఇందారం ఎల్లయ్య, వేముల రాజేశం, వేముల రాజేందర్, మంథని సమ్మయ్య, చిట్యాల సమ్మయ్య, పులిగంటి మల్లేష్, కేసారపు నరేష్, కాసిపేట మధునయ్య, మంథని లింగయ్య, బాషవేణి మల్లేష్ యాదవ్, ఆకుదారి నరేష్, మంథని రాజ పోచయ్య, మంథని కిష్టయ్య, ఆరేపల్లి మల్లయ్య, మంథని సతీష్, ఇనుగాల కొండయ్య, మంథని శంకర్, బుద్ధార్తి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020